

జుర్రేరు శుద్ధి పనులు ప్రారంభం

వాగులో అక్రమ కట్టడాలు తొలగిస్తాం
ఆక్రమణలు ప్రోత్సహించిన
మాజీ ఎమ్మెల్యే కాటసాని :మంత్రి బీసీ



జుర్రేరు వాగు శుద్ధి పనులు ప్రారంభిస్తున్న రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): బనగానపల్లె పట్టణ నడిబొడ్డున ఉన్న జుర్రేరువాగు శుద్ధి పనులను రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వయంగా మంత్రి ఎక్స్‌కవేటర్‌ను కాసేపు నడిపి జుర్రేరువాగులో ముళ్లకంపలను తొలగించారు. అనంతరం ఆయన విలేఖర్ల సమావేశంలో మాట్లాడుతూ మొదటి విడతగా రూ19.70 లక్షలతో జుర్రేరువాగులోని ముళ్లకంపలు, గుర్రపు డెక్కలు తొలగించి శుద్ధి కార్యక్రమం ఆరంభిస్తున్నట్లు తెలిపారు. వాగుకు ఇరువైపుల ఆక్రమణలను మొదటి దశలో తొలగించనున్నట్లు మంత్రి తెలిపారు. 5 ఏళ్ల క్రితం 2014-19 తెలుగుదేశం పార్టీ హయంలో నీరు చెట్టు పథకం కింద జుర్రేరు వాగును పరిశుభ్రం చేసినట్లు తెలిపారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో జుర్రేరువాగును పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. స్వార్థ రాజకీయాల కోసం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి జుర్రేరువాగులో ఆక్రమణలు ప్రోత్సహించారని విమర్శించారు. అమాయకులైన కార్పెంటర్లకు మాయమాటలు చెప్పి జుర్రేరు వాగులో షెడ్లు వేయించారన్నారు. అనుమతి తీసుకోకుండా ఓ ఫంక్షన్ హాల్‌కు దారి కోసం దాని యజమాని వాగును ఆక్రమించి రోడ్డును నిర్మించుకున్నారన్నారు. ఇలాంటి ఆక్రమణలను తొలగిస్తామన్నారు. రెండో విడతలో మురుగునీరు జుర్రేరులో కలవకుండా జుర్రేరువాగునుంచి బ్రహ్మంగారి మఠం వరకు మురుగునీటి కోసం ప్రత్యేక ప్రణాళికలతో శుద్ధి చేసి వాటిని బ్రహ్మంగారి మఠం వద్ద కలిసేలా చర్యలు తీసుకుంటామని మంత్రి బీసీ తెలిపారు. అలాగే పట్టణంలో ప్లాస్టిక్ నివారణకు తన సతీమణి ఇందిరమ్మ కృషి చేస్తోందని, అందుకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మైనర్ ఇరిగేషన్ ఎస్‌ఈ బాలచంద్రారెడ్డి, ఈఈ రఘురామిరెడ్డి, డీఈ నాగన్న, ఏఈ రామ్మోహన్‌రెడ్డి, పంచాయతీరాజ్ డీఈ నాగశ్రీనివాసులు, తహసీల్దారు నారాయణరెడ్డి, అధిక సంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎక్స్‌కవేటర్‌ను నడుపుతున్న మంత్రి



నీటి సంఘాల ఎన్నికలకు సిద్ధం

- డిసెంబరు 5న నోటిఫికేషన్ జారీ
- 8న ఉమ్మడి జిల్లాలో 384 సాగు నీటి సంఘాలకు..
- 11న డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, 14న ప్రాజెక్టు కమిటీల ఎన్నిక
- ఎన్నికల విధుల్లో ఐదు వేల మంది పైగా సిబ్బంది

సాగునీటి సంఘాల ఎన్నికలకు జిల్లా యంత్రాంగం కసరత్తు చేస్తోంది. కలెక్టరు పి. రంజిత్‌బాషా డిసెంబరు 5న నోటిఫికేషన్ జారీ చేస్తారు. 8 నుంచి 14వ తేదీలోగా కసరత్తు పూర్తి చేసేలా షెడ్యూల్ ఖరారు చేశారు. తొమ్మిదేళ్ల తరువాత నీటి సంఘాల ఎన్నికలకు అక్టోబరు 21న కలెక్టరు నోటిఫికేషన్ జారీ చేశారు. షెడ్యూలు ప్రకారం 23న ఎన్నికలు జరగాల్సి ఉంది. అసెంబ్లీ సమావేశాల కారణంగా వాయిదా వేశారు. ప్రస్తుతం ఎన్నికల నిర్వహణకు రెండు జిల్లాల యంత్రాంగం పక్కా ప్రణాళిక సిద్ధం చేసింది. దాదాపుగా ఐదు వేల మంది సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొననున్నారు. కర్నూలు కలెక్టర్ పి. రంజిత్‌బాషా, నంద్యాల కలెక్టర్ రాజకుమారి పర్యవేక్షణలో ఎన్నికల నిర్వహణపై శిక్షణ ఇస్తున్నారు. ఏకగ్రీవం చేసుకోవడానికి అధికార టీడీపీ కూటమి నేతలు వ్యూహాలు రచిస్తున్నారు. పట్టు కోసం బరిలో దిగాలని వైసీపీ నాయకులు ఎత్తులు వేస్తున్నారు. దీంతో చలికాలంలోనూ పల్లెసీమల్లో నీటి సంఘాల ఎన్నికల వేడి రాజుకుంది.



జలమండలి కార్యాలయం

పల్లెల్లో ఎన్నికల వేడి

కర్నూలు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో తుంగభద్ర దిగువ కాలువ, గాజులదిన్నె ప్రాజెక్టు, టీబీపీ హెచ్చెల్సీ ఆలూరు బ్రాంచి కెనాల్, హంద్రీనీవా కాలువ, కేసీ కాలువ, రాంపురం ఛానల్ కెనాల్, నంంద్యాల జిల్లాలో కేసీ కాలువ, తెలుగుగంగ, ఎస్‌ఆర్‌బీసీ, శివభాష్యం, వైలవరం ప్రాజెక్టులతో పాటు మైనర్ ఇరిగేషన్ చెరువులు ఉన్నాయి. ఈ నీటి వనరుల నిర్వహణకు ఉమ్మడి జిల్లాలో 384 సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరగాల్సి ఉండింది. రాష్ట్ర విభజన తర్వాత 2015-16లో ఆనాటి టీడీపీ ప్రభుత్వం సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించింది. 2019 మేలో కొలువుదీరిన వైసీపీ ప్రభుత్వంలో ఎన్నికలు నిర్వహించలేదు. నీటి సంఘాలు, డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, ప్రాజెక్టు కమిటీలకు అధ్యక్ష, ఉపాధ్యక్షులు, డైరెక్టర్లగా వైసీపీ నాయకులు, సానుభూతిపరులను నామినేట్ చేసింది. మళ్లీ టీడీపీ కూటమి ప్రభుత్వం రాకతో గ్రామ సీమల్లో సాగునీటి సంఘాల్లో రైతులను భాగస్వామ్యం చేసి.. కాలువలు, డిస్ట్రిబ్యూటరీలను ఆధునికీకరించాలనే సంకల్పంతో ఎన్నికల నిర్వహణకు సై అంది. మూడు దశల్లో ఎన్నికలు ప్రక్రియ పూర్తి చేసేందుకు జిల్లా కలెక్టర్ల పర్యవేక్షణలో కసరత్తు చేస్తున్నారు. అదే క్రమంలో ఎన్నికల నిర్వహణ సిబ్బందికి శిక్షణ ఇస్తున్నారు. శుక్రవారం కర్నూలు కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో జిల్లా ఎన్నికల నిర్వహణ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు.

కర్నూలు జిల్లాలో 123 సాగునీటి సంఘాలు, 10 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, 2 ప్రాజెక్టు కమిటీ ఎన్నికలకు జిల్లా కలెక్టర్ పి. రంజిత్‌బాషా, నంద్యాల జిల్లాలో 261 సాగునీటి సంఘాలు, 25 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, 4 ప్రాజెక్టు కమిటీల ఎన్నికలకు ఆ జిల్లా కలెక్టర్ రాజకుమారి డిసెంబరు 5న నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. కర్నూలు జిల్లాలో 123 నీటి సంఘాలకు 1,212 టీసీ (ప్రాదేశిక నియోజకవర్గం) సభ్యులు, నంద్యాల జిల్లాలో 261 సాగునీటి సంఘాలకు 2,349 టీసీ సభ్యులను రైతులు ఎన్నుకుంటారు. టీసీ సభ్యులు డబ్ల్యూయూఏ అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకుంటారు. ఉమ్మడి జిల్లాలో 35 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, 6 ప్రాజెక్టు కమిటీల అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎంపిక జరగాల్సి ఉంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేసింది. ఆయా సాగునీటి వనరుల కింద కర్నూలు జిల్లాలో 2,20,499.43 ఎకరాలు, నంద్యాల జిల్లాలో 45,98,190.68 ఎకరాల ఆయకట్టు ఉంది. 2015-16లో భూయాజ్యమాన్యం హక్కు కలిగిన ఆయకట్టు రైతులను ఓటర్లుగా గుర్తించి ఎన్నికలు నిర్వహించారు. తొమ్మిదేళ్ల ఎన్నికలు నిర్వహించకపోవడంతో ఈ మధ్యకాలం భూముల క్రయవిక్రయాలు, అన్నదమ్ములు విభాగాలు జరిగడంతో రెవిన్యూ రికార్డుల్లో భూయాజమాన్యం హక్కు కలిగిన రైతులు మారిపోయారు. ఇంజనీర్లు, రెవిన్యూ అధికారులు (తహసీల్దారులు) సమన్వయంతో ఆయకట్టు రైతులను గుర్తించి ఓటర్ల జాబితా తయారీ కోసం ప్రత్యేక అధీకృత రెవిన్యూ అధికారులను నియమించారు. వీరు తయారు చేసే ఓటర్ల జాబితా ఆధారంగా ఎన్నికలు నిర్వహిస్తారు.

మిగతా 6లో..

డిప్యూటీ కలెక్టర్ల నియామకం

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాకు నలుగురు డిప్యూటీ కలెక్టర్లను నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా సమగ్ర శిక్ష ఏపీసీగా డిప్యూటీ కలెక్టర్ టి. శ్రీనివాసులు, శ్రీశైలం ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా బీ.కే. వెంకటేశ్వర్లు, జీజీహెచ్ అడ్మినిస్ట్రేటర్‌గా డిప్యూటీ కలెక్టర్ సింధు సుబ్రహ్మణ్యం, హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్-3 స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా ఎం. శేషిరెడ్డి నియమితులయ్యారు.

మాతా శిశు మరణాలపై
కలెక్టర్ ఆగ్రహం

నంద్యాల కల్చరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మాతాశిశు మరణాలపై నంద్యాల కలెక్టర్ రాజకుమారి సంబంధిత శాఖలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో మెటర్నిటీ, చైల్డ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ ప్రసవం తర్వాత మాతృమరణాలు జరిగి పిల్లలను అనాథలుగా మారుతున్నారన్నారు. ఇంత పెద్ద ప్రభుత్వ వ్యవస్థ ఉండి కూడా తల్లీబిడ్డలను సంరక్షించకపోవడం బాధాకరమన్నారు. ఇది నాపని, ఇది వాళ్లపని ఒకరిమీద ఒకరు వేసుకోకుండా సమన్వయంతో పనులు చేసుకుంటూ ముందుకు వెళ్లాలని కలెక్టర్ ఆదేశించారు. ఇందుకోసమే ప్రతి సోమవారం అధికారులు, సిబ్బందిని ఒకే చోట సమావేశపరచి కోఆర్డినేషన్ ఇబ్బంది లేకుండా పలు ఆదేశాలు జారీ చేస్తున్నప్పటికి క్షేత్రస్థాయిలో వెళ్లడం లేదని కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇటీవల అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ చేసినప్పుడు గదిని కూడ శుభ్రంగా పెట్టుకోలేని స్థితిలో ఉన్నారన్నారు. గత సమావేశంలో 4 మాతృమరణాలు, 3 శిశుమరణాలు జరిగాయన్నారు. వైద్యశాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖలు పూర్తిగా విఫలమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు.

మార్క్‌ఫెడ్ డీఎంల బదిలీ



హరినాథరెడ్డి

కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లా మార్క్‌ఫెడ్ సంస్థలో పని చేస్తున్న జిల్లా మేనేజర్లను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నంద్యాల జిల్లా మార్క్‌ఫెడ్ డీఎంగా కొనసాగుతున్న నాగరాజును అక్కడే దాణా ప్లాంట్ మేనేజర్‌గా కొనసాగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. టెక్నికల్ మండల వ్యవసాయాధికారిగా నంద్యాల జేడీ కార్యాలయంలో పని చేస్తున్న హరినాథరెడ్డిని అదే జిల్లా మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్‌గా బదిలీ చేసింది. కర్నూలు జిల్లా మేనేజర్‌గా పని చేస్తున్న రాజును కూడా మరి కొద్దిరోజుల్లో బదిలీ చేస్తున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం కడపలో పని చేస్తున్న పరిమళ జ్యోతి కర్నూలు జిల్లాకు రానున్నట్లు విశ్వసనీయ సమాచారం.

వాల్మీకి కార్పొరేషన్ చైర్ పర్సన్‌గా
కప్పట్రాళ్ల బొజ్జమ్మ



బాధ్యతలు చేపట్టిన కప్పట్రాల బొజ్జమ్మ

ఆలూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ చైర్ పర్సన్‌గా ఆలూరు నియోజకవర్గం దేవన కొండ మండలానికి చెందిన టీడీపీ నాయకురాలు కప్పట్రాళ్ల బొజ్జమ్మ శుక్రవారం విజయవాడలోని బీసీ భవన్‌లో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె వాల్మీకి వర్గాలకు సంక్షేమ పథకాలు అందేలా చూస్తామన్నారు. నిరుద్యోగ యువత జీవనోపాధి కోసం రుణాలు ఇచ్చేందుకు కృషి చేస్తా అన్నారు. తనకు ఈ అవకాశం కల్పించిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రులు నారా లోకేష్, టీజీ భారత్, ఎంపీ బస్తిపాటి నాగరాజుకు, సహకరించిన టీడీపీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం బొజ్జమ్మతో పాటు టీడీపీ నాయకుడు రామచంద్రనాయుడు టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు టీడీ జనార్దన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

మాలల ఐక్యతతోనే
వర్గీకరణకు చరమగీతం
అమలాపురం మాజీ ఎంపీ హర్షకుమార్ 7

రైతు సమస్యలను పరిష్కరిస్తాం
జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ 6

రైతులకు జింకల బెడద

- పంటల రక్షణకు పాట్లు
- పరిహారం అందించాలని వేడుకోలు



రోళ్లపాడు గ్రామంలో జింకలు, అడవి పందుల నుంచి పంటను కాపాడుకునేందుకు పొలం చుట్టూ కట్టిన చీరలు

మిడుతూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రైతులకు జింకలు, పందుల బెడద అధికమైంది. ఆరుగాలం కష్టపడి సాగు చేస్తున్న పంటలు అడవి జంతువులు పాలు కావడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. మిడుతూరు మండలంలో మొక్కజొన్న, కంది, జొన్న, పత్తి, మినుము, కొర్ర తదితర పంటలను రైతులు సాగు చేస్తున్నారు. ప్రస్తుతం మొక్కజొన్న, మినుము, కొర్ర పంటలు కోత దశలో ఉన్నాయి. అయితే అడవి పందులు, జింకలు గుంపులు గుంపులుగా వచ్చి పంటలను ధ్వంసం చేస్తున్నాయి. రైతులకు అందాల్సిన పరిహారం నివేదికలకే పరిమితమవుతోందని రైతులు విమర్శిస్తున్నారు. మండలంలోని రోళ్లపాడు, అలగనూరు, తలముడిపి, చెరుకుచెర్ల, జలకనూరు తదితర గ్రామాలకు సమీపంలో రోళ్లపాడు అభయ అరణ్యం ఉంది. దీని చుట్టూ పూర్తి స్థాయిలో కంచె ఏర్పాటు చేయనందున జింకలు, పందులు గుంపులుగా సంచరిస్తూ పొలాల్లో బీభత్సం సృష్టిస్తున్నాయి. చేతికి వచ్చిన పంటను కాపాడుకునేందుకు కొందరు రైతులు పొలం చుట్టూ చీరలు కట్టి కాపాడునే ప్రయతం చేస్తున్నారు. మరికొందరు రైతులు పెద్ద పెద్ద శబ్దాలతో అడవి జంతువులను చెదర గొట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఈ విషయంపై ఫారెస్టు రెంజర్ అధికారిని వివరణ కోరగా అడవి జంతువుల వల్ల నష్టపోయిన రైతులు తమ దృష్టికి తీసుకు వస్తే పరిహారం అందేలా చూస్తామని ఆయన తెలిపారు.

రైతులను ఆదుకోవాలి



జింకలు, పందుల దాడితో పంటలు నాశనమవుతున్నాయి. దీంతో తీవ్రంగా నష్టపోతున్నాం. పంటలను కాపాడుకోవడానికి పాట్లు పడుతున్నాం. అధికారులు నష్టపోయిన రైతులను గుర్తించి ఆదుకోవాలి.

- ప్రసాద్, రైతు, రోళ్లపాడు

సకాలంలో చెరువులు నింపుతాం

- జలవనరుల శాఖ ఎస్‌ఈ బాలచంద్రారెడ్డి



హంద్రీ నీవా కాలువ నుంచి చెరువుకు నీటిని విడుదలను పరిశీలిస్తున్న ఎస్‌ఈ

కర్నూలు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువ ద్వారా సకాలంలో 77 చెరువులను నింపుతామని జలవనరుల శాఖ కర్నూలు సర్కిల్ ఎస్‌ఈ బి.బాలచంద్రారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కృష్ణగిరి మండలం లక్కసాగరం వద్ద నిర్మించిన పంప్‌హౌస్‌ను పరిశీలించారు. డిస్ట్రిబ్యూటరీ పాయింట్‌ను తనిఖీ చేశారు. ఈ నెల 26న జరిగిన ఐఏబీ సమావేశంలో కర్నూలు జిల్లాలో ఉన్న 42 చెరువులకు తక్షణమే హంద్రీనీవా కాలువ ద్వారా నీటిని నింపాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటి వరకు పత్తికొండ, డోన్ నియోజకవర్గాల్లో 63 చెరువులు పూర్తిగా, పాక్షికంగా నింపితే.. కర్నూలు జిల్లాలో కృష్ణగిరి, తుగ్గలి, పత్తికొండ, కల్లూరు మండలాల్లో 42 చెరువులకు గానూ 15 చెరువులు పూర్తి స్థాయిలో, 14 చెరువులు పాక్షికంగా నింపినట్లు ఎస్‌ఈ బాలచంద్రారెడ్డి ఆంధ్రజ్యోతికి వివరించారు. త్వరలోనే అన్ని చెరువులను నింపుతామని తెలిపారు. ఎస్‌ఈ వెంట ఎఫ్‌ఆర్‌ఎల్ డివిజన్ డీఈఈలు రామకృష్ణ, శ్రీనివాస నాయక్, కోయా కంపెనీ ప్రతినిధులు ఉన్నారు.

గరిష్ఠంగా ఉల్లి రూ.5,259

వేరుశనగ కాయలు నిలకడగా రూ.6,850 ● పతనమైన ఎండు మిర్చి ధరలు



కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రైతులకు పంటల సాగు జూదంలా మారిపోయింది. ఏ పంటకు ఏ సమయంలో ధర వస్తుందో.. తగ్గుతుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది. రెండు రోజుల కిందట ఉల్లికి గరిష్ఠ ధర రూ.4,200, కనిష్ఠ ధర రూ.400 దక్కగా శుక్రవారం గరిష్ఠ ధర ఏకంగా క్వింటానికి రూ.5,259, మధ్యస్థ ధర రూ.3,519, కనిష్ఠ ధర రూ.515 దక్కింది. వేరుశనగ కాయల ధర మాత్రం నిలకడగా ఉంది. గత సంవత్సరం ఈ సమయానికి రూ.7వేలకు పైగా ఉన్న గరిష్ఠ ధర ప్రస్తుతం రూ.6,850గా నమో దైంది. మధ్యస్థ ధర రూ.6,109, కనిష్ఠ ధర రూ.4,499 రైతులకు అందినట్లు సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి తెలిపారు. గత సంవత్సరం ఇదే సమయానికి ఎండు మిరపకాయలకు రూ.25 వేలకు పైగానే గరిష్ఠ ధర నమోదైంది. శుక్రవారం గరిష్ఠ ధర రూ.14,859లు, మధ్యస్థ ధర రూ.11,499, కనిష్ఠ ధర రూ.799 మాత్రమే రైతుల చేతికి అందింది. మొక్కజొన్నలకు గరిష్ఠ ధర రూ.2,269, మధ్యస్థ ధర రూ.2,263, కనిష్ఠ ధర రూ.2,119 పలికింది. కందు లు గరిష్ఠ, మధ్యస్థ ధర లు రూ.9,469, కని ష్ఠ ధర రూ.8,609 రైతులకు అందాయి.

టాలెంట్



వెండి తెర వెంకట్

- 'ముహూర్తం'తో మొదలైన నట ప్రస్థానం
- సినీ రంగంలో రాణిస్తున్న ఎమ్మిగనూరు వాసి

ఎమ్మిగనూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి):

నటించటం ఆయనకు ప్రాణం.. అంతకు మించి నటనలో జీవించటం ఆయన ప్రతిభకు నిదర్శనం. నటనపై ఉన్న ఆసక్తే సినీరంగంలో ప్రవేశానికి ముహూర్తమైంది. 'ముహూర్తం' పేరుతోనే సినీ ప్రస్థానం మొదలైంది. ముహూర్తంతో మొదలైన నట జీవితం బుల్లి, వెండి తెరల వైపుగా సాగింది. గుంపు నటుడుగా ప్రవేశించి నటనా ప్రావీణ్యంతో ఆర్టిస్టుగా రాణిస్తున్నాడు. పుట్టినూరుతోపాటు తన పేరును వెండితెరపై చూడాలన్న ఆసక్తి వెండి తెర వైపు నడిపించిందని, తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకోవాలని పాతికేళ్లుగా నటనా రంగంలో రాణిస్తున్నానని వెంకట్ చెబుతున్నారు.

నటనపై ఆసక్తితో..

ఎమ్మిగనూరు పట్టణంలోని ఎస్‌ఎంటీ కాలనీలో రంగయ్య, సుభద్రమ్మల మూడో కుమారుడు వెంకట గోవిందరాజు. తండ్రి స్థానిక చేనేత సహకార సంఘంలో అకౌంటెంట్‌గా పని చేసేవాడు. తల్లి గృహిణి. వెంకట గోవిందరాజులు స్థానిక వీవర్స్ కాలనీలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి వరకు చదివాడు. చిన్నప్పటి నుంచే సినిమాలపై ఎంతో ఆసక్తి ఉండేది. పలుమార్లు పాఠశాలకు డుమ్మా కొట్టి సినిమాలకు వెళ్లేవాడు. ఇలా సినిమాలు చూడడంతో సినీ రంగంపై ఆసక్తి పెరిగింది. వెంకట గోవిందరాజులు సీనియర్ ఎన్టీఆర్ నటించిన దానవీరశూరకర్ణ సినిమాను దాదాపు 50 సార్లు చూశాడంటే సినిమా అంటే ఎంత పిచ్చో అర్థం చేసుకోవచ్చు. అప్పట్లోనే ఎలాగైనా తాను కూడా సినిమా రంగంలోకి వెళ్లాలని, నటుడిగా సినిమాల్లో నటించి మంచి నటుడిగా గుర్తింపు పొంది తనకు తన ఊరికి మంచి పేరు తీసుకురావాలనుకున్నాడు. ఇందులో భాగంగానే 1998లో ఎమ్మిగనూరు నుంచి హైదరాబాదుకు వెళ్లి ఓ సినిమా, డ్యాన్స్ ఇన్‌స్టిట్యూట్‌లో చేరి ఏడాది నుంచి రెండేళ్ల పాటు శిక్షణ తీసుకున్నాడు. 2000 నుంచి దాదాపు ఐదేళ్ల పాటు సినిమాల్లో గుంపులో నటుడిగా నటిస్తూ వచ్చాడు. అలా సినిమా రంగ ప్రవేశం చేశాడు. ఐదేళ్ల పాటు నటుడిగా పని చేస్తుండడంతో పలువురి సినిమా వాళ్లతో పరిచయాలు పెరిగాయి. అటు తర్వాత సినిమా అవకాశాన్ని సంపాదించుకున్నాడు.



ఓ సీరియల్‌లో నటిస్తున్న వెంకట్

మంచి నటుడిగా గుర్తింపు పొందాలన్నదే లక్ష్యం

సినిమా ప్రేక్షకులు, బుల్లి తెర ప్రేక్షకులను నా నటనతో అలరించి మంచి నటుడిగా గుర్తింపు తెచ్చుకోవాలన్నదే నా లక్ష్యం. ప్రేక్షకులే మాకు దేవుళ్లు. వారి ఆదరాభిమానాలతోనే ఇప్పటి వరకు ఈ స్థాయికి వచ్చాను. రాబోయే రోజుల్లో మరిన్ని అవకాశాలు పొంది ప్రేక్షకులను అలరించాలన్నదే నా కోరిక.

- వెంకట గోవిందరాజులు అలియాస్ వెంకట్‌జి, సినీ నటుడు

ముహూర్తం సినిమాతో మొదలై..

2005లో విడుదలైన ముహూర్తం (నంది అవార్డు సినిమా) సినిమాలో హీరో ప్రవీణ్‌కుమార్ స్నేహితుడిగా మొదటి సారి వెండితెరపై నటించాడు. అటు తర్వాత శశాంక్ హీరోగా నటించిన అదే నువ్వు.. అదే నేను, 1940లో ఒక గ్రామం, రైల్వేస్టేషన్ వంటి సినిమాలతోపాటు మొత్తం 50 సినిమాల్లో నటుడిగా రాణించారు. ఓ వైపు సినిమాల్లో వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూనే మరో వైపు బుల్లితెరపై కూడా తన నటనను కొనసాగిస్తూ వచ్చాడు. ప్రధానంగా ముద్దమందారం, కథలో రాజకుమారుడు, అభిషేకం, మనసు మమత, క్రాంతి, లక్ష్యం, ఆనందమానందమాయే, స్వాతి చినుకులు, మామగారు, అమ్మాయిగారు వంటి సీరియల్స్‌లో నటించాడు. ఇలా దాదాపు 200 వరకు సీరియల్స్‌లో తన నటనతో ప్రేక్షకులను అలరిస్తూ వస్తున్నాడు. ముహూర్తం, అదే నువ్వు.. అదే నేను సినిమాలతో మంచి గుర్తింపు లభించగా, వరూధిని పరిణయం, రాధమ్మ కూతురు, స్వాతి చినుకులు వంటి సీరియల్స్ ద్వారా బుల్లితెర నటుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు. ప్రస్తుతం వెంకట్ నటించిన ప్రేమియో సినిమా రిలీజ్‌కు సిద్ధంగా ఉంది. సాధారణ కుటుంబం నుంచి వెళ్లి అటు వెండి తెరపైన.. ఇటు బుల్లితెరపైన తనదైన నటనతో సినీ, బుల్లి తెర ప్రేక్షకులను అలరిస్తున్న వెంకట్‌కు మరిన్ని మంచి అవకాశాలు వచ్చి ఎమ్మిగనూరు వెండితెరపై చూపేలా చేయాలని ఎమ్మిగనూరు సినీ ప్రేక్షకులు ఆకాంక్షిస్తున్నారు.

బాల్య వివాహాలు నేరం

- ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించండి
- జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి. నవ్య



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ డా.బి. నవ్య

కర్నూలు హాస్పిటల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, కిశోర బాలికలు ఎదుర్కొంటున్న ఈ సమస్యపై గ్రామాల్లోని ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని జాయింట్ కలెక్టర్ డా.బి. నవ్య పిలుపునిచ్చారు. మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో ఐసీడీఎస్ పీడీ పి.వెంకటలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జేసీ మాట్లాడుతూ కిషోర వికాసంపై శిక్షణ పొందిన వారు ఈ వయస్సులో బాలికల్లో వచ్చే మార్పులు, ఆరోగ్యం, పోషకాహారంపై అవగాహన కల్పించాలన్నారు. మండల స్థాయిలో, గ్రామస్థాయిలో కమిటీలను బలోపేతం చేయడానికి మూడు నెలలకు ఒకసారి సమావేశాలు నిర్వహించాలన్నారు. అనంతరం బాల బాలికలకు అత్యవసర హెల్ప్ డెస్క్ నెంబర్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీసీపీవో టి.శారద, డీఆర్‌డీఏ ఐసీడీఎస్ మున్సిపాలిటీ ఎడ్యుకేషన్ హెల్త్ అండ్ ఆర్‌కేఎస్‌కే ఎన్‌జీవో ప్రతినిధులు, జిల్లా బాలల సంక్షేమ సమితి సభ్యులు, మెప్మా శిక్షకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ఆత్మకూరు రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎదురెదురుగా రెండు బైకులు ఢీకొని శ్రీనివాసులు(26) అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన ఆత్మకూరు మండలం కరివేన గ్రామ శివారులోని కేజీ రహదారిపై జరిగింది. శుక్రవారం ఆత్మకూరు ఎస్ఐ వెంకటనారాయణరెడ్డి తెలిపిన వివరాలివీ.. కొత్తపల్లి మండలం నందికుంట గ్రామానికి చెందిన ఉద్యానవన శాఖ ఎంపీఈవో శ్రీనివాసులు బైక్‌పై పాములపాడుకు వెళ్లి అక్కడ తన పనులు ముగించుకుని తన స్వగ్రామానికి బయలు దేరాడు. ఈ క్రమంలో ఆత్మకూరు నుంచి పాములపాడుకు మరో బైక్‌పై వెళుతున్న గుర్తు తెలియని వ్యక్తి మండలంలోని కరివేన గ్రామ శివార్లలోని వీర బ్రహ్మేంద్ర స్వామి గుడి ప్రాంతంలోని కేజీ రోడ్డుపై ఎదురుగా వచ్చాడు. ప్రమాదవశాత్తు రెండు బైకులు ఢీకొన్నాయి.ఈ రోడ్డు ప్రమాదంలో ఎంపీఈవో శ్రీనివాసులుకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. శ్రీనివాసులును 108లో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే శ్రీనివాసులు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటనారాయణరెడ్డి తెలిపారు.

రహదారి పనుల పరిశీలన

రైతుల సమస్యలు పరిష్కరిస్తామన్న జేసీ



రైతుల పొలాలకు రస్తాలను పరిశీలిస్తున్న జేసీ విష్ణుచరణ్

నందికొట్కూరు రూరల్/జూపాడుబంగ్లా, నవంబరు29 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారి 340 పనులను జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, నేషనల్ హైవే పీడీ పద్మజ శుక్రవారం పరిశీలించారు. నందికొట్కూరు మండలంలోని నందికొట్కూరు, బొల్లవరం, దామగట్ల, బ్రాహ్మణకొట్కూరు పొలాల మీదుగా వెళుతున్న జాతీయ రహదారి పనులను నంద్యాల జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, పీడీ పద్మజ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జయసూర్య మాట్లాడుతూ ఈ జాతీయ రహదారి నిర్మాణం వల్ల రైతుల పొలాలకు వెళ్లే రహదారులు మూసుకు పోయాయని, దీని వల్ల రైతులు తమ పొలాలకు వెళ్లడానికి చాలా కష్టపడాల్సి వస్తుందని జేసీ దృష్టికి తీసుకుని వెళ్లారు. స్పందించిన జేసి విష్ణుచరణ్ మాట్లాడుతూ రైతుల రస్తా సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకుని వెళతానని అన్నారు. ఈ కార్యక్రమంలో నందికొట్కూరు తహసీల్దార్ శ్రీనివాసులు, మాజీ ఎంపీపీ వీరం ప్రసాదరెడ్డి, బ్రాహ్మణకొట్కూరు మాజీ సింగిల్ విండో చైర్మన్ మద్దూరు హరిసర్వోత్తమరెడ్డి, ఖలీలుల్లా బేగ్ పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా మండలంలో...

జూపాడుబంగ్లా మండలం తాటిపాడు వద్ద రెండురోజుల కిందట రైతులు జాతీయ రహదారి పనులను అడ్డుకోవడాన్ని శుక్రవారం జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ పరిశీలించారు. సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయాలని, లేకపోతే రైతులం కిలోమీటర్ల పొడవున పొలాల్లో ఇబ్బందులు పడాల్సి వస్తుందని వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్, రైతులు ఖాజీకురైషన్, రవికుమార్‌యాదవ్, మన్సూర్‌బాషా, జిన్నుబాసా, మాలిక్‌బాషా పాల్గొన్నారు.

ఆయుష్..!

- వైద్యులు లేక రోగుల అగచాట్లు
- ఆయుర్వేద ఆసుపత్రికి ఫార్మాసిస్టు దిక్కు

కర్నూలు హాస్పిటల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలోని ఆయుర్వేద, హోమియో వైద్యశాలలో డాక్టర్లు లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఆయుష్ విభాగంలో నిర్వహించే ఆసుపత్రులు నిర్వీర్యమవుతున్నాయి. కర్నూలు జీజీహెచ్‌లోని ఆయుర్వేద వైద్యశాలలో వైద్యులు లేకపోవడంతో ఫార్మాసిస్టు రోగులకు దిక్కయ్యారు. కర్నూలు జీజీహెచ్ ఆయుర్వేద వైద్యశాలలో పని చేస్తున్న ఆయుర్వేద సీనియర్ మెడికల్ ఆఫీసర్‌కు కర్నూలు జీజీహెచ్‌తో పాటు సీ.క్యాంపు, ఎమ్మిగనూరు ఇలా మూడు చోట్ల డ్యూటీలు వేశారు. వారంలో కొన్ని రోజులు ఆయుర్వేద డాక్టరు లేకపోవడంతో పాత చీటి తీసుకుని వచ్చిన రోగులకు ఫార్మాసిస్టు మందులను అందిస్తున్నారు. వైద్యం కోసం వచ్చిన రోగులు ఆయుర్వేద డాక్టర్ లేకపోవడంతో వెనక్కు వెళ్లిపోతున్నారు. ఇక కర్నూలు జీజీహెచ్ హోమియో వైద్యశాలలో కూడా హోమియో సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లేకపోవడం అక్కడనున్న సిబ్బంది ఒక్కరే ఉన్నారు. ఈ హోమియో డాక్టర్‌కు కూడా వెల్దుర్తి, కర్నూలు జీజీహెచ్ రెండు చోట్ల ఆయుష్ అధికారులు బాధ్యతలు అప్పగించారు. వెల్దుర్తిలో మంగళ, గురు, శనివారాల్లో పని చేస్తుండగా.. మిగిలిన మూడు రోజులు కర్నూలు జీజీహెచ్ హోమియో వైద్యశాలలో విధులు నిర్వహించేలా ఆయుష్ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. కర్నూలు జీజీహెచ్‌లోని ఆయుర్వేదం, హోమియో వైద్యశాలలో బుధవారం మరో ప్రాంతంలో విధులు నిర్వహిస్తుండటంతో ఇక్కడ ఉదయం ఫార్మాసిస్టు, మరో ఉద్యోగి వచ్చి ఆసుపత్రులను తెరుస్తున్నారు. ప్రతి రోజు డాక్టర్లు ఉంటే.. 60 నుంచి 70 మంది రోగులు వస్తుంటారు. జిల్లా కేంద్రమైన కర్నూలు జీజీహెచ్‌లోని ఆయుష్ విభాగంలో వైద్యులు లేకపోవడంపై రోగులు మండిపడుతున్నారు. జిల్లా కేంద్రంలోనే ఈ పరిస్థితి ఉంటే మిగిలిన వైద్యశాలల పరిస్థితి ఏమిటని రోగులు ప్రశ్నిస్తున్నారు.



ఆయుర్వేద వైద్యశాలలో మందులు ఇస్తున్న ఫార్మాసిస్టు



హోమియో వైద్యశాలలో ఉన్న ఉద్యోగి

పోలీసుల ముమ్మర తనిఖీలు



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

నంద్యాల క్రైం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు శుక్రవారం జిల్లా వ్యాప్తంగా విజిబుల్ పోలీసింగ్‌లో ముమ్మర తనిఖీలు నిర్వహించినట్లు పోలీస్ అధికారులు తెలిపారు. అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో పోలీస్ అధికారులు, సిబ్బంది ఈ తనిఖీలు నిర్వహించారు. రోడ్డు ప్రమాదాల నివారణ, మద్యం, పీడీఎస్ బియ్యం, గంజాయి తదితర వాటిని అక్రమ రవాణా చేయకుండా అడ్డుకునేందుకు విజిబుల్ పోలీసింగ్ నిర్వహించినట్లు పేర్కొన్నారు. సైబర్ క్రైం, రోడ్డు ప్రమాదాలు, డ్రగ్స్ వాడకం వల్ల జరిగే నష్టాలు, మహిళలపై జరిగే నేరాలు తదితర వాటిపైన ప్రజలకు అవగాహన కల్పించారు. జిల్లాలో నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా విజిబుల్ పోలీసింగ్ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఆయా గ్రామాల్లో పోలీస్ అధికారులు, సిబ్బంది ఫుట్ పెట్రోలింగ్ చేస్తూ ప్రజలకు శాంతిభద్రతలపై భరోసా కల్పించారు.

నీటి సంఘాల ఎన్నికలకు సిద్ధం



5వ పేజీ తరువాయి

చలి కాలంలో రాజకీయ వేడి

అసెంబ్లీ సార్వత్రిక ఎన్నికలు తరువాత జరుగుతున్న ఎన్నికలు ఇవి. అధికార, ప్రతిపక్ష పార్టీలకు గ్రామాల్లో రాజకీయ పట్టు కోసం నీటి సంఘాలు కీలకంగా మారనున్నాయి. నీటి సంఘాలను ఏకగ్రీవం చేసుకోవడానికి అధికార టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు వ్యూహాత్మంగా పావులు కదుపుతున్నారు. ఇప్పటికే ఎమ్మెల్యేలు, ముఖ్య రాజకీయ నాయకులు రంగంలోకి దిగారు. నీటి సంఘాలు, డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, ప్రాజెక్టు కమిటీల అధ్యక్ష, ఉపాధ్యక్ష అభ్యర్థుల వేటలో నిమగ్నమయ్యారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర ఓటమితో నిస్తేజంలో ఉన్న వైసీపీ నాయకులు కూడా నీటి సంఘాల ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఎత్తులు వేస్తున్నారు. ఈ ఎన్నికల్లో పట్టు సాధిస్తే రాబోయే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఉపయోగకరంగా ఉంటుందని ఇరుపార్టీల నేతలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవడంతో పల్లెసీమల్లో రాజకీయ వేడి రాజుకుంది.

నీటి సంఘాల ఎన్నికల షెడ్యూల్

- నోటిఫికేషన్ (టీసీ, డబ్ల్యూయూఏ, డీసీ, పీసీ కమిటీ): డిసెంబరు 5
- నీటి సంఘాల టీసీ సభ్యులు, అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నిక : 8న
- డిస్ట్రిబ్యూటరీ కమిటీ (మేజర్, మీడియం ప్రాజెక్ట్స్) : 11న
- మేజర్, మీడియం ప్రాజెక్ట్ కమిటీ ఎన్నిక : 14న

కర్నూలు జిల్లాలో సాగునీటి సంఘాలు, డీసీ, పీసీ, ఆయకట్టు (ఎకరాలు) వివరాలు

ప్రాజెక్టు	డబ్ల్యూయూఏ	డీసీ	పీసీ	ఆయకట్టు
కేసీ కెనాల్	2	–	--	4,760
తుంగభద్ర	58	10	1	1,51,134
ప్రాజెక్టు ఎల్లెల్సీ ఆలూరు	6	–	--	14,254.67
బ్రాంచి కెనాల్ హంద్రీ నీవా కాలువ	3	–	--	5,072.82
గాజులదిన్నె ప్రాజెక్టు	12	–	1	25,488.34
మైనర్ ఇరిగేషన్ చెరువులు	42	–	--	19,789.60
మొత్తం	123	10	2	2,20,499.43

నంద్యాల జిల్లాలో సాగు నీటి సంఘాలు, డీసీ, పీసీ, ఆయకట్టు (ఎకరాలు) వివరాలు:

ప్రాజెక్టు	డబ్ల్యూయూఏ	డీసీ	పీసీ	ఆయకట్టు
కేసీ కాలువ	52	9	1	1,62,854.46
శ్రీశైలం కుడి కాలువ (ఎస్సార్బీసీ)	50	8	1	1,53,034.8
తెలుగుగంగ ప్రాజెక్టు	47	8	1	1,29,412.42
శివభాష్యం ప్రాజెక్టు	7	–	1	12,092
మైనర్ ఇరిగేషన్ చెరువులు	104	–	--	40,056.79
మైలవరం ప్రాజెక్టు	1	–	--	740.21
మొత్తం	261	25	4	4,98,190.68

పెద్దాసుపత్రి అడ్మినిస్ట్రేటర్‌గా డిప్యూటీ కలెక్టర్

సింధు సుబ్రహ్మణ్యంను నియమిస్తూ ఉత్తర్వులు

కర్నూలు హాస్పిటల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల అడ్మినిస్ట్రేటర్‌గా డిప్యూటీ కలెక్టర్ సింధు సుబ్రహ్మణ్యంను నియమిస్తూ ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ నీరబ్ కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో పరిపాలనకు సంబంధించిన వ్యవహారాన్ని ఇక నుంచి డిప్యూటీ కలెక్టర్ చూడనున్నారు. ఆసుపత్రిలోని ఏజెన్సీలు, టెక్నికల్ వ్యవహారాలు, పరికరాల కొనుగోలు, వ్యవహారాన్ని డిప్యూటీ కలెక్టర్ నిర్వహిస్తారు. ఆసుపత్రి సూపరింటెండెంట్, సీఎస్ఆర్ఎంవో, ఆర్ఎంవోలు వైద్యసేవలకే పరిమితమవుతున్నట్లు సమాచారం.

మధ్యాహ్న భోజనం ధరలు పెంపు

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): జిల్లాల్లో ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం పథకానికి సంబంధించిన ధరలను పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శ్యామ్యూల్ పాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీఎం పోషణ పథకం కింద అందిస్తున్న మధ్యాహ్న భోజనం ధరలను 1నుంచి 5వ తరగతి వరకు చదివే విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ 5.45 నుంచి రూ 6.19, 6నుంచి 8వ తరగతి వరకు విద్యార్థులకు రూ. 8.17 నుంచి రూ.9.29 పెంచుతూ ఆదేశాలు జారీ చేశారు. పెంచిన రేట్లు డిసెంబరు 1వ తేదీ నుంచి అమలులోకి రానున్నట్లు డీఈవో వివరించారు. నాణ్యమైన, రుచికరమైన ఆహారాన్ని అందించేలా విద్యాశాఖ అధికారులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని ఈయన సూచించారు.

తినేస్తున్నారు..!



పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం

- మధ్యాహ్న భోజన పథకం నిర్వహణలో ఏజెన్సీ దోపిడీ
- పిల్లల సంఖ్యకు.. బియ్యం కోటాకు తేడా
- వంట మనుషుల గౌరవ వేతనంలోనూ నొక్కుడే

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులు అందినకాడికి దోచేస్తున్నారు. అడిగేవారే లేరని ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. పట్టణంలోని నెహ్రూ మెమోరియల్ పురపాలక ఉన్నత పాఠశాలలో 1,952 మంది విద్యార్థులు చదువుతున్నారు. విద్యార్థుల సంఖ్య అధికంగా ఉండడంతో భారీగా మిగులుతుందని వంట నిర్వహణకు పోటీ పడ్డారు. వైసీపీ ప్రభుత్వం మారి కూటమి అధికారంలోకి రావడంతో వంట ఏజెన్సీ నిర్వాహకులను కూడా మార్చారు. అధికార పార్టీకి చెందిన ఓ మహిళా నాయకురాలు తన అనుచరుడికి చెందిన మహాలక్ష్మి గ్రూప్ ఏజెన్సీకి వంట చేసే బాధ్యతను అప్పగించేలా పావులు కదిపినట్లు సమాచారం. సెప్టెంబరు 1 నుంచి మహాలక్ష్మి గ్రూప్ చెందిన భరత్ అనే వ్యక్తి వంట చేసే బాధ్యతను తీసుకున్నారు. 1,952 మంది విద్యార్థుల్లో 150 మందిని డ్రాప్‌ఔట్ కింద చూపుతున్నారు. 1,800 మంది ఉన్నట్లు రికార్డుల్లో చూపుతున్నారు. శుక్రవారం 1,321 మంది విద్యార్థులు బడికి హాజరయ్యారు. 1,140 మంది విద్యార్థులు మధ్యాహ్న భోజనం తింటున్నట్లు ఆన్‌లైన్‌లో పొందుపరిచారు.

● 70 కేజీల బియ్యం ఎక్కడికి వెళ్లినట్లు..?


1321 మంది హాజరైతే 1140 మధ్యాహ్న భోజనం తింటున్నట్లు లెక్కలు చూపిస్తూ.. ఒక్కో విద్యార్థికి 150 గ్రాముల చొప్పున బియ్యం ప్రభుత్వం అందిస్తోంది. ఈ లెక్కన 171 కేజీల బియ్యాన్ని విద్యార్థులకు వడ్డించాల్సి ఉంది. మరి గురువారం వంద కేజీల బియ్యం మాత్రమే వండారు. అంటే మిగతా 71 కేజీల బియ్యం ఎక్కడికి వెళ్లాయో తెలియాల్సిన అవసరం ఉంది. ఈ ఒక్క రోజే కాదు ప్రతిరోజూ విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న లెక్కల్లో, బియ్యం కొలతల్లోనూ వ్యత్యాసం ఉన్నట్లు తెలుస్తోంది.

● గౌరవ వేతనంలోనూ నొక్కుడే..

1800 మంది విద్యార్థులు ఉండడంతో పది మందికి ఓ కుక్, హెల్పర్లను నియమించుకోవచ్చని ఏజెన్సీలకు సూచించింది. ఒక్కొక్కరికి నెలకు రూ.3 వేల గౌరవ వేతనం అందిస్తోంది. పూర్తిగా వారి గౌరవ వేతనం డ్రా చేస్తున్నప్పటికీ వంట చేసేది మాత్రం కేవలం ఆరుగురు మాత్రమే. ఇందులోనూ నెలకు రూ.12 వేలు నొక్కేస్తున్నారు.

● ప్రభుత్వమే అన్ని ఇస్తున్నా..

కూటమి ప్రభుత్వం మారాక మధ్యాహ్న భోజన పథకం మెనూలో భారీగా మార్పులు చేసింది. గురువారం ఆకుకూర పప్పు, అన్నంతో పాటు గుడ్డు అందించాలి. బియ్యం, గుడ్డు ప్రభుత్వమే నేరుగా పాఠశాలలకు కాంట్రాక్టర్ ద్వారా సరఫరా చేస్తోంది. వంట చేసేందుకు, ఇతర ఖర్చుల కోసం ఒక్కో విద్యార్థికి రూ.8.17 పైసలను చెల్లిస్తోంది. ఈ లెక్కన్న రోజుకు రూ.9313 విద్యార్థుల సంఖ్యను బట్టి వారికి చెల్లిస్తోంది. అయినప్పటికీ ఏజెన్సీ నిర్వాహకులు భారీగా దోచేస్తున్నారు. విద్యార్థుల



హాజరు.. భోజనం తింటున్న విద్యార్థుల సంఖ్య, భోజనం తయారీకి బియ్యం వేసిన లెక్కను అడిగితే ఆ పాఠశాల హెచ్ఎం అలిం సిద్ధికి అసహనం వ్యక్తం వేశారు.

● కొరవడిన పర్యవేక్షణ

విద్యాశాఖ అధికారులు తూతూ మంత్రంగా మధ్యాహ్న భోజన పథకాన్ని పర్యవేక్షణ చేసి వెళుతున్నారు. పాఠశాల హెచ్ఎం, వంట ఏజెన్సీ వారు చెప్పిందే లెక్క.. గుడ్డిగా సంతకం చేసి తనిఖీ చేసినట్లు వెళ్లిపోతున్నారు. పర్యవేక్షణ లేకపోవడంతో వీరు ఆడిందే ఆట పాడిందే పాటగా తయారైంది. ఇంత తతంగం జరుగుతున్నా అధికారులు మాత్రం పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

నిబంధనలు పాటించకపోతే చర్యలు



ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం విద్యార్థులకు భోజనం వడ్డించాలి. ప్రభుత్వం మధ్యాహ్నం భోజన పథకంలో ఖచ్చితమైన నిబంధనలు పాటించాలని సూచించింది. పాఠశాలలోని విద్యార్థులంతా భోజనం చేసేలా వారిని ఉపాధ్యాయులు ప్రోత్సహించాలి. వంట ఏజెన్సీలు సైతం మెనూ పాటించకపోతే చర్యలు తీసుకుంటాం. విద్యార్థుల నిష్పత్తికి అనుగుణంగా వంట మనిషితో పాటు సహాయకులు ఉండాల్సిందే. నిబంధనలు పాటించకుండా బియ్యం వినియోగంలో తారతమ్యం ఉంటే సహించే ప్రసక్తే లేదు. ఆ పాఠశాలలో విద్యార్థులు మధ్యాహ్న భోజనానికి సంబంధించిన రికార్డులను తెప్పించుకుని పరిశీలిస్తాం.

\- శ్యామ్యూల్ పాల్, డీఈఓ, కర్నూలు

త్వరలో జిల్లా సహకార బ్యాంకు సీఈవోల నియామకం



జిల్లా సహకార కేంద్ర బ్యాంకు

కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జిల్లా సహకార కేంద్ర బ్యాంకుల్లో ఖాళీగా ఉన్న సీఈవోల పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు ప్రారంభించినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఈ నెల 13, 14 తేదీల్లో కర్నూలు, గుంటూరు, ప్రకాశం, ఏలూరు, అనంతపురం జిల్లాల సహకార కేంద్ర బ్యాంకుల సీఈవోల పోస్టులను భర్తీ చేసేందుకోసం ఆప్కాబ్ ఇంటర్వ్యూలను కూడా నిర్వహించింది. కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు సీఈవోగా నియమించేందుకు ఇక్కడ పని చేస్తున్న నాగిరెడ్డి (డీజీఎం) ఇంటర్వ్యూకు హాజరైనట్లు తెలిసింది. మరో ముగ్గురుకి సీఈవోగా నియామకం పొందేందుకు అర్హత ఉన్నా.. వారికి ఆ పదవి ఇష్టం లేక ఇంటర్వ్యూకు హాజరు కాలేదు. రాజకీయ నేతల పడగ నీడలో సహకార కేంద్ర బ్యాంకు సీఈవోలుగా పని చేయడం అంటే కత్తిమీద సాములా ఉంటుందని వారు ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది.

మార్క్‌ఫెడ్ డీఎం ఆకస్మిక తనిఖీ

● రైతులకు ఎరువుల కొరత లేదని వెల్లడి



గోదాంలో ఎరువులను పరిశీలిస్తున్న అధికారులు

కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): నంద్యాల మార్క్‌ఫెడ్ డీఎం హరినాథరెడ్డి శుక్రవారం ప్యాపిలి మండల కేంద్రంలోని డీసీఎంఎస్ కేంద్ర కార్యాలయాన్ని, గోదామును అకస్మికంగా శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోదాములో నిల్వ చేసిన ఎరువులు, కందులను పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ డీసీఎంఎస్ కేంద్రాలకు ఎరువులను సప్లయ్ చేయడంలో ఇబ్బందులను రాష్ట్ర ఉన్నతాధికారులతో మాట్లాడుతామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం జిల్లాకు కేటాయించిన ఎరువుల్లో 50 శాతం ఎరువులను రైతులకు ఎటువంటి కొరత లేకుండా రైతు సలహా కేంద్రాలు, వ్యవసాయ సహకార కేంద్రాలకు సరిపడ ఎరువులను అందిస్తున్నామని, ఎమ్మార్పీ ధరలకే ఈ ఎరువులను రైతులకు అందిస్తున్నట్లు డీఎం హరినాథరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ అధికారి రాఘవేంద్రరెడ్డి ఉన్నారు.

ఆర్టీసీ బస్టాండులో బంగారు గొలుసు అపహరణ

కర్నూలు క్రైం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో శుక్రవారం బంగారు గొలుసు అపహరణకు గురైంది. పత్తికొండ మండలం నల్లచెలిమి గ్రామానికి చెందిన నాగరాజు దోర్నాలలో ఎస్‌బీఐ బ్యాంకులో ఉద్యోగం చేస్తున్నాడు. సొంతూరు వచ్చి తిరిగి దోర్నాల వెళ్లేందుకు కర్నూలుకు వచ్చాడు. కర్నూలులో దోర్నాల బస్సు ఎక్కే సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఈయన మెడలోని 4 తులాల బంగారు గొలుసుతో పాటు పర్సును అపహరించారు. దీంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. ఫోర్త్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శుభకార్యంలో...

మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో మెగాసిరి ఫంక్షన్ హాలులో జరిగిన ఓ శుభకార్యంలో లక్ష్మి అనే మహిళ బంగారు నెక్లెస్ మాయమైంది. ఎండోమెంట్ కాలనీకి చెందిన నారాయణ, లక్ష్మి దంపతులు తమ కోడలు సీమంతం కార్యక్రమాన్ని స్థానిక మెగాసిరి ఫంక్షన్ హాలులో నిర్వహించారు. ఫంక్షన్ మొత్తం పూర్తయిన తర్వాత గ్రూప్ ఫొటో దిగే సమయంలో లక్ష్మి తన 5 తులాల నెక్లెస్‌ను పక్కన పెట్టి ఫొటో దిగింది. కొద్ది సేపటి తర్వాత చూస్తే అది కనిపించలేదు. సీసీ కెమెరాలు పరిశీలిస్తే.. ఆ సమయంలో మాత్రమే సీసీ కెమెరాలు ఆఫ్ చేసినట్లుగా గుర్తించారు. దీంతో వీరు పోలీసులను ఆశ్రయించారు. మూడో పట్టణ పోలీసులు కేసు విచారణ చేపట్టారు.

టమోటా ప్రాసెసింగ్ యూనిట్‌కు కనకదిన్నె దగ్గర స్థలం కేటాయింపు

పత్తికొండ టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): టమోటా ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేసేందుకు పత్తికొండ మండలం కనకదిన్నె సమీపాన ప్రభుత్వ భూమిని కేటాయించినట్లు తహసీల్దార్ రమేష్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో హోసూరు గ్రామ సమీపాన టమోటా జ్యూస్ ప్రాసెసింగ్ యూనిట్‌కు స్థలం కేటాయించడం జరిగిందని, ఆ స్థలం అనువైనది కాకపోవడంతో దీన్ని రద్దు చేయడం జరిగిందన్నారు. అయితే దూదేకొండ రెవెన్యూ పరిధిలోని కనకదిన్నె గ్రామ సమీపాన సర్వే.నెంబర్.63లో 2.50 ఎకరాల ప్రభుత్వ భూమిని ప్రాసెసింగ్ యూనిట్‌కు కేటాయించడం జరిగిందన్నారు. ఈ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు కావడం వల్ల చుట్టు పక్కల గ్రామాల ప్రజలకు ఉపాధి అవకాశాలు ఉంటాయని తెలిపారు.

టైరు పేలి ట్రాక్టర్ బోల్తా ఒకరి మృతి.. ముగ్గురికి గాయాలు



బండలు మీద పడడంతో మల్లికార్జున మృతి

వెల్దుర్తి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): టైరు పేలి ట్రాక్టర్ బోల్తా పడిన ఘటనలో ఒకరు మృతి చెందారు. మరో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన శుక్రవారం వెల్దుర్తిలో చోటుచేసుకుంది. ఓర్వకల్లు మండల కేంద్రానికి చెందిన ట్రాక్టర్ నాపరాతి బండల లోడుతో గోరంట్ల మండలం ఎస్‌హెచ్. ఎర్రగుడికి వెళుతోంది. శుక్రవారం తెల్లవారు జామున మార్గ మధ్యంలో వెల్దుర్తి సమీపాన నక్కలమిట్ట (ఎగుమిట్ట) ఎక్కే సమయంలో ట్రాక్టర్ ఇంజన్ పెద్ద టైరు పేలిపోయి ట్రాక్టర్ అదుపు తప్పింది. ఎగువ మిట్ట కావడంతో లోడుతో ఉన్న ట్రాలీ పక్కకు బోల్తా కొడుతున్న సమయంలో డ్రైవర్ రామాంజనేయులు, ట్రాలీ మీద ఉన్న నాగేశ్వరరావు, కృష్ణ, మల్లికార్జున కిందకు దూకారు. నాపరాళ్లు మల్లికార్జున మీద పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మిగతా ముగ్గురికి గాయాలయ్యాయి. అటుగా వెళుతున్న వాహనదారులు 108 వాహనానికి సమాచారం అందించారు. గాయపడిన వారిని అంబులెన్స్‌లో వెల్దుర్తి సీహెచ్‌సీ ఆసుపత్రికి తరలించారు. మృతిచెందిన మల్లికార్జున మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వెల్దుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

గంజాయి కేసుల్లో నిందితులకు జైలు శిక్ష

కర్నూలు లీగల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రెండు వేర్వేరు గంజాయి కేసులలో నలుగురు నిందితులపై నేరం రుజువు కావడంతో ఏడాది జైలు శిక్షతో పాటు రూ.18వేలు జరిమానా విధిస్తూ కర్నూలు ఎక్సైజ్ కోర్టు మేజిస్ట్రేట్ ఎం.సరోజనమ్మ శుక్రవారం తీర్పు చెప్పారు. 2018లో నగరంలోని కర్నూలుకు చెందిన నిందితులు శ్రీనివాసులుగౌడు, దావీదు, నీలి శికారి సన్ను, దోమల కార్తీక్ అనే నలుగురు నిందితుల నుంచి పెద్దమొత్తంలో పోలీసులు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కోర్టులో వీరిపై నేరం రుజువు కావడంతో ఏడాది కారాగారశిక్షతో పాటు రూ.18వేల జరిమానా విధించినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కే.చంద్రహాసన్ ఒక ప్రకటనలో తెలిపారు.

మాలల ఐక్యతతోనే వర్గీకరణకు చరమగీతం

మాజీ ఎంపీ హర్షకుమార్



మాట్లాడుతున్న ఎంపీ హర్షకుమార్

ఆదోని, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మాలల ఐకమత్యంతో ఎస్సీ వర్గీకరణకు చరమగీతం పాడుదామని మాజీ ఎంపీ హర్ష కుమార్, మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పండు అశోక్ కుమార్ అన్నారు. శుక్రవారం ఆదోనిలో మాలల ఆత్మీయ సమ్మేళనం జరిగింది ముందుగా ఆర్ట్స్ కళాశాల జేబీ గార్డెన్ నుంచి పురవీధులలో పెద్ద ఎత్తున ర్యాలీ చేపట్టారు. జేబీ గార్డెన్‌లో నిర్వహించిన సభలో వారు మాట్లాడారు. సుప్రీంకోర్టు వర్గీకరణకు అనుకూలంగా తీర్పునివ్వడం అన్యాయమన్నారు. రాజకీయ దురుద్దేశంతోనే మాల, మాదిగలను విడదీస్తున్నారని ఆరోపించారు. మాలలంతా ఐక్యతతో ముందుకు సాగకపోతే మనుగడ కష్టంగా మారుతుందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికైనా వర్గీకరణపై పునరాలోచించుకొని వెనక్కి తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు న్యాయవాది చంద్రయ్య, కొండలరావు కుమార్ స్వామి, జై భీమ్ సాయి, కల్లుబోతుల సురేష్, విజయ, శేఖర్, విజయ్ కుమార్, మాధవస్వామి, బొబ్బిలి, ఎల్లప్ప, మహానంది పాల్గొన్నారు.

ఎంఎస్‌ఎంఈ సర్వేను వేగవంతం చేయాలి

- జిల్లా గ్రామ పంచాయతీలో ఉపాధి హామీ పనులు జరగాలి
- ఇళ్ల నిర్మాణాలు వేగంగా జరగాలి
- గ్రామాల్లో తాగునీటి సమస్యలను గుర్తించి నివేదిక ఇవ్వండి
- కలెక్టర్ పి. రంజిత్ బాషా



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ పి. రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎంఎస్‌ఎంఈ సర్వేను వేగవంతం చేసి వచ్చే ఏడాది ఫిబ్రవరి 1వ తేదీ నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ పి. రంజిత్ బాషా ఎంపీడీవోలను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి ఎంఎస్‌ఎంఈ సర్వే, హౌసింగ్, ఉపాధి హామీ, పీజీఆర్ఎస్, రీసర్వే తదితర అంశాలపై స్పెషల్ ఆఫీసర్లు, డివిజన్, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎంఎస్‌ఎంఈ సర్వే శుక్రవారం నుంచి ప్రారంభం అయిందన్నారు. ఎంఎస్‌ఎంఈ సర్వేకి సంబంధించిన రోజువారి పురోగతి నివేదికలు తనకు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. సాగునీటి సంఘాల ఎన్నికలను ఇలాంటి లోటుపాట్లు లేకుండా నియమ నిబంధనల ప్రకారం నిర్వహించాలని అన్నారు. రీసర్వేకు సంబంధించి గ్రామ సభలు నిర్వహించడం ద్వారా వచ్చిన 18వేల అర్జీలను పీజీఆర్ఎస్ పోర్టల్‌లో రిజిస్టర్ చేయాలని అన్నారు. డిసెంబరు 31నాటికి అర్జీలను అన్నింటినీ నాణ్యతతో పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని తహసీల్దార్లను ఆదేశించారు. హౌసింగ్‌కు సంబంధించి పురోగతి చూపని 153 మంది ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు షోకాజ్ నోటీసులు జారీ చేశామన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ డా.బి. నవ్య, డీఆర్వో వెంకటనారాయణమ్మ, ఇన్‌చార్జి హౌసింగ్ పీడీ చిరంజీవి పాల్గొన్నారు.


డ్రైవర్‌కు అస్వస్థత

- రోడ్డు సైడుకు దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు
- విద్యార్థులకు త్రుటిలో తప్పిన ప్రమాదం

మంత్రాలయం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): డ్రైవర్‌కు మూర్ఛ రావడంతో ఆర్టీసీ బస్సు రోడ్డు సైడుకు దూసుకెళ్లింది. ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందులో ఉన్న విద్యార్థులు ఊపిరి పీల్చుకున్నారు. మండలంలోని వి. తిమ్మాపురం గ్రామానికి చెందిన దాదాపు 30 మంది విద్యార్థులను శుక్రవారం ఉదయం బస్సులో ఎక్కించుకొని డ్రైవర్ రామలింగడు ఎమ్మిగనూరు బయలుదేరాడు. మార్గమధ్యంలో డ్రైవర్ రామలింగడుకు మూర్ఛ రావడంతో బస్సు రోడ్డు పక్కనే ఆగి ఉన్న మోటారు సైకిల్‌ను ఢీకొట్టి పొలంలోకి దూసుకెళ్లింది. దీంతో బస్సులో ఉన్న 30 మంది విద్యార్థులు భయాందోళనలకు గురయ్యారు. 108 అంబులెన్స్ సిబ్బంది డ్రైవర్‌ను ఎమ్మిగనూరు ఆసుపత్రికి తరలించారు.

వీడిన అనుమానాస్పద మృతి కేసు మిస్టరీ

మృతుడి భార్య, మరో ఇద్దరి అరెస్టు



నిందితులను చూపుతున్న డీఎస్పీ రవికుమార్

కొలిమిగుండ్ల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : అనుమానాస్పద మృతి కేసును కొలిమిగుండ్ల పోలీసులు ఛేదించారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆళ్లగడ్డ డీఎస్పీ రవికుమార్ వెల్లడించారు. మండలంలోని పెట్నికోటలో ఈ నెల 26న పామిడి రమేష్ హత్యకు గురయ్యాడు. అయితే పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. వల్లెపు వేణుగోపాల్, వడ్డె నారాయణస్వామి అనే వ్యక్తులతో కలిసి భర్త ముఖంపై తల గడతో అదిమి భార్య రమాదేవి హత్య చేసినట్టు విచారణలో తేలింది. ఇందుకు రమాదేవి వివాహేతర సంబంధమే ఇందుకు కారణమని తెలిసింది. నిందితులను పెట్నికోట సమీపంలో కొలిమిగుండ్ల సీఐ రమేష్‌బాబు అరెస్టు చేశారు. రమాదేవితో పాటు మరో ఇద్దరు ముగ్గురు నిందితులను మీడియా ముందు ప్రవేశపెట్టారు. కార్యక్రమంలో ఎస్ఐ వెంకటేశ్వర్లు, ఏఎస్ఐ గోవిందనాయక్, కానిస్టేబుళ్లు రాజ్‌భాస్కర్, కొండారెడ్డి తదితరులు ఉన్నారు.

అనుమతి లేని ప్రైవేటు ల్యాబ్‌లను సీజ్ చేయాలి

● డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట ధర్నా

కర్నూలు హాస్పిటల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట ఉన్న అనుమతి లేని ప్రైవేటు ల్యాబ్‌లను సీజ్ చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కే. శ్రీనివాసులు, నగర కార్యదర్శి బీసన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా వైద్యఆరోగ్య శాఖ కార్యాలయం ఎదుట అనుమతి లేని డయోగ్నస్టిక్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. డీఎంహెచ్‌వో, కలెక్టర్ ఆఫీసుకు కూతవేటు దూరంలో బుధవారపేటలో ఇటీవల ప్రభుత్వ అనుమతి లేని ప్రైవేటు ల్యాబ్‌లు, డయోగ్నస్టిక్ సెంటర్ల ఏర్పాటు చేసి, కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో పేద రోగులను దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. అనేకసార్లు అనుమతి లేని ల్యాబ్‌లపై చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వోలకు వినతి చేసినా, ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. అదే అదునుగా ప్రైవేటు డయోగ్నస్టిక్ సెంటర్లు విచ్చలవిడిగా అర్హత లేని వ్యక్తులతో పరీక్షలు నిర్వహిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నాయని మండిపడ్డారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు చంటి, నాగేశ్వరరావు, నగర ఆర్గనైజింగ్ సెక్రటరీ కృష్ణ, నాగరాజు, శివాజీ పాల్గొన్నారు.

రోబోటిక్ గుండె ఆపరేషన్ల వర్క్‌షాపు

● హైదరాబాదు సదస్సుకు

హాజరైన సిటీ సర్జన్ డా. ప్రభాకర్ రెడ్డి



హైదరాబాదులో జరుగుతున్న రోబోటిక్ వర్క్‌షాపులో పాల్గొన్న డా. ప్రభాకర్ రెడ్డి

కర్నూలు హాస్పిటల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): హైదరాబాదులో షరటాన్ హోటల్‌లో జరిగే రెండు రోజుల రోబోటిక్ హార్ట్ సర్జరీ వర్క్‌షాప్‌కు కర్నూలు జీజీహెచ్‌కు చెందిన సీనియర్ సిటీ సర్జన్ డా.సి.ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు. సదస్సులో సిటీ గుండె ఆపరేషన్లను చిన్న కోత ఆపరేషన్ల ద్వారా చేస్తున్నారని, ఇప్పుడు రోబోటిక్ ద్వారా ఆపరేషన్లు చేయడానికి మనదేశంలో కూడా వర్క్‌షాపులు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం ఇండియాలో రోబోటిక్ హార్ట్ సర్జరీలు చేయడానికి రూ.15 నుంచి 20లక్షలు ఖర్చు అవుతుందని ఈసేవలు అందుబాటులోనికి వస్తే చార్జీలు తగ్గే అవకాశం ఉంటుందన్నారు.

మహిళ ఆత్మహత్య

బనగానపల్లె, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలుకూరు గ్రామానికి చెందిన మోసు కాశింబీ (41) శుక్రవారం ఆత్మహత్య చేసుకుంది. కాశింబీని 22 ఏళ్ల క్రితం అదే గ్రామానికి చెందిన మోసు సుబ్రమణ్యంకు ఇచ్చి వివాహం చేశారు. ఇప్పటి వరకు వీరికి సంతానం కలగలేదు. డాక్టర్లకు చూపించినా ఎటువంటి ప్రయోజనం కనిపించలేదు. దీంతో తనకు పిల్లలు పుట్టరన్న మనస్థాపంతో ఇంటిలో పురుగుల మందు తాగింది. బంధువులు గమనించి బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా కోలుకోలేక మృతి చెందింది. కాశింబీ తండ్రి జలజన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు నందివర్గం ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు.

డీఈవో కార్యాలయ ఏడీగా నాగభూషణం

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఏడీగా నాగభూషణంను నియమిస్తూ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. డీఈవో ఆఫీసులో పని చేస్తున్న ఏడీ శ్యామ్యూల్ పాల్ డీఈవోగా ఎఫ్ఏసీ పదోన్నతి పొందడంతో ఏడీ పోస్టు ఖాళీ ఏర్పడింది. విజయవాడ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్‌లో ఏడీగా పని చేస్తున్న నాగభూషణంకు బదిలీపై పోస్టింగ్ ఇచ్చారు. అలాగే డీఈవో కార్యాలయంలో పని చేస్తున్న ఇద్దరు పర్యవేక్షణాధికారులు రవి కుమార్, రాజశేఖర్‌ను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. రవికుమార్‌ను అన్నమయ్య జిల్లా విద్యాశాఖ ఆఫీసులో ఇన్‌చార్జి ఏడీగా, అనంతపురం జిల్లాకు రాజశేఖర్‌ను బదిలీ చేశారు.

డిగ్రీ పరీక్షలు ప్రారంభం


కర్నూలు అర్బన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో 3, 4 డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. కర్నూలు, నంద్యాల జిల్లాలోని 61 పరీక్షా కేంద్రాల్లో జరుగుతున్న పరీక్షలను వర్సిటీ ఇన్‌చార్జి ఉపకులపతి, ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్, పరీక్షల విభాగం అధికారులు పరిశీలించారు.

కొత్త ఇళ్లకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు

● హౌసింగ్ డీఈఈ విజయకుమార్

పత్తికొండ టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కొత్త ఇళ్ల కోసం గ్రామ సచివాలయాల్లో ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకోవచ్చని హౌసింగ్ డీఈఈ విజయకుమార్ తెలిపారు. శుక్రవారం ఆయయన విలేకరులతో మాట్లాడుతూ అర్హత కలిగిన వారు కొత్త ఇళ్ల మంజూరు కావాలంటే ఆయా గ్రామ సచివాలయాల్లో తమ సొంత స్థలం ఉన్న వారు, మట్టిమిద్దెలు పడిపోయిన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్న లబ్ధిదారులను గుర్తించేందుకు ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఏఈలు స్థలాలను పరిశీలించి అర్హత కలిగి ఉంటే.. యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో ఇంటి నిర్మాణం కోసం నమోదు చేస్తామని అన్నారు. పీఎంఏవై గ్రామీణ 2.0 ప్రోగ్రాం కింద రూ.1.20లక్షతో పాటు ఎన్ఆర్ఈజీఎస్ కింద రూ.30వేలు హౌసింగ్ కింద నిధులు వస్తాయన్నారు. అలాగే కర్నూలు కుడా, పీఎంఏవై అర్బన్ కింద ఆన్‌లైన్ చేసుకుంటే యూనిట్ కాస్ట్ రూ.2.50 లక్షలు ఇంటి నిర్మాణానికి మంజూరు అవుతాయన్నారు. సొంత స్థలం ఉన్న వారు జియో ట్యాగింగ్ పూర్తి చేసి ఇళ్ల మంజూరుకు ప్రతిపాదనలు పంపిస్తామని, అర్హత కలిగిన వారు కొత్త ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలి: డీఎస్పీ



కరపత్రాలను పంపిణీ చేస్తున్న డీఎస్పీ

ఆదోని రూరల్ నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరు జాగ్రత్తగా ఉండాలని డీఎస్పీ సోమన్న సూచించారు. శుక్రవారం మండలంలోని ఢణాపురంలో సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించి కరపత్రాలను పంపిణీ చేశారు. డీఎస్పీ మాట్లాడుతూ ఫోన్లకు ఓటీపీలు, ఫేస్‌బుక్, ఇన్‌స్ట్రా, వాట్సాప్‌లలో వచ్చే లింకులు, నెంబర్లతో గుర్తు తెలియని వ్యక్తులు పంపే సందేశాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏవైనా సైబర్ నేరస్థుల పాల్పడితే.. ఎదుర్కోవాలన్నారు.

క్రీడలతో నాయకత్వ లక్షణాలు

● డిప్యూటీ ఈవో వెంకటరమణారెడ్డి



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న డిప్యూటీ ఈవో వెంకటరమణారెడ్డి

ఆదోని అగ్రికల్చర్ , నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : క్రీడలతో విద్యార్థులు నాయకత్వ లక్షణాలను అవర్చుకోవచ్చని డిప్యూటీ ఈవో వెంకటరమణారెడ్డి అన్నారు. శుక్రవారం ఎస్‌కేడీ కాలనీ లీలాస్ పాఠశాల క్రీడామైదానంలో ఆదోని జోనల్ త్రో బాల్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ చదువులు ఎంత ముఖ్యమో క్రీడలు కూడా అంతే ముఖ్యమన్నారు. గెలుపోవడటములను సమానంగా తీసుకోవాలని కోరారు. 17టీంలు టోర్నమెంట్‌లో పాల్గొనగా హోరాహోరీగా క్రీడా పోటీలు సాగాయి. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రతిభబాయ్, వ్యాయమ ఉపాధ్యాయులు ఈరన్న, ఖలీల్ అహ్మద్, నరసింహులు, సుశీల, రామన్న, నరసింహారాజు, నరసన్న ఆలీ పాల్గొన్నారు.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

'యోగా సాధనతో ఆరోగ్యకరమైన జీవితం'



యోగా సాధనలో అభ్యాసకులు

నంద్యాల క్రైం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): యోగా సాధనతో ఆరోగ్యకరమైన జీవితం సాధ్యమవుతుందని సాయుధ బలగాల (ఏఆర్) అడిషనల్ ఎస్పీ చంద్రబాబు అన్నారు. ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాలమేరకు శుక్రవారం పోలీస్ పరేడ్ డ్రిల్ కార్యక్రమంలో భాగంగా యోగా ట్రైనర్ ఆశ సహకారంతో పోలీస్ సిబ్బందికి యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ చంద్రబాబు మాట్లాడుతూ కొన్నివేల సంవత్సరాల క్రితం పతంజలి మహర్షి ఎంతో ముందుచూపుతో మన సమాజం ఆరోగ్యవంతంగా ఉండాలనే ఉద్దేశంతో యోగా ప్రక్రియను ఏర్పాటు చేశామన్నారు. నిత్యం పనిఒత్తిడితో ఇబ్బందులు పడకుండా ఉండేందుకు యోగా ఎంతో అవసరమని పేర్కొన్నారు. పోలీసులు విధినిర్వహణలో ఎదురయ్యే సవాళ్లు, మానసిక ఒత్తిడిని యోగా సాధనవల్ల అధిగమించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్లు ఇస్మాయిల్, అన్సర్‌బాషా, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు మంజునాథ్, శ్రీనివాసులు, పట్టణంలోని పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

'దళారి వ్యవస్థను అరికట్టాలి'



వెలుగోడులో వరి ధాన్యాన్ని పరిశీలిస్తున్న నాయకులు

వెలుగోడు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): వరి రైతాంగాన్ని దోపిడీ చేస్తున్న దళారి వ్యవస్థను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అరికట్టాలని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ జిల్లా కార్యదర్శి నర్సింహులు డిమాండ్ చేశారు. శుక్రవారం వెలుగోడులో సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ, అఖిల భారత రైతుకూలీ సంఘం బృందం సభ్యులు వరిధాన్యాన్ని పరిశీలించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం రైతులు పండించిన వరిధాన్యాన్ని తేమశాతంతో సంబంధం లేకుండా మద్దతు ధర ప్రకారం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

వైభవంగా స్వాతి వేడుకలు

నంద్యాల కల్చరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): నంద్యాల తెలుగుపేటలో వెలసిన మద్దులేటి లక్ష్మీనృసింహ స్వామి దేవస్థానంలో శుక్రవారం స్వామివారి జన్మనక్షత్రమైన స్వాతి సందర్భంగా స్వాతి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా స్వామికి ఉదయం పంచామృత అభిషేకం, స్నపన తిరుమంజనం నిర్వహించారు. అనంతరం స్వామికి పట్టు వస్త్రాలు, పూలమాలలతో అలంకరించి నైవేద్యం సమర్పించి మహా మంగళ హారతి ఇచ్చారు. కార్యక్రమంలో అర్చకులు శ్రీరామమూర్తి, భక్తులు పాల్గొన్నారు.

ఆర్జీఎంలో 'సెవెన్ సెగ్మెంట్ క్లబ్' ప్రారంభం

పాణ్యం, నవంబరు29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో సెవెన్ సెగ్మెంట్ కౌన్సిల్ క్లబ్ ఏర్పాటు చేశారు. ఈ క్లబ్‌లో ఏడు సాంకేతిక విభాగాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కౌన్సిల్ కోఆర్డినేటర్ డాక్టర్ సోఫియా ప్రియదర్శిని తెలిపారు. ఆవిష్కార్, ఉద్భవ్, యంత్ర విద్య, కళావిహార్, స్వర్ణ వికాస్, సంభవ్, నిపుణత్వ వంటి ఏడు విభాగాల ద్వారా సమస్యల పరిష్కారం, డిజైన్ థింకింగ్, ప్రాజెక్ట్ ఆలోచన, సాంకేతిక సదస్సులు, పరిశ్రమల ట్రెండ్, మ్యాట్ ల్యాబ్, క్యాడెన్స్, పిస్పైస్, మైక్రోవిండ్‌పై అవగాహన కల్పించనున్నారు. అలాగే ఫొటోగ్రఫీ, కళలు, అలంకరణ, పత్రికా ప్రచురణ, బయోడేటా తయారీ, పోర్ట్‌ఫోలియో తయారీపై అవగాహన కల్పించనున్నారు. గిట్‌హబ్, సాఫ్ట్ స్కిల్స్, అవేర్‌నెస్ ఆన్ స్టార్టప్ మేనేజ్‌మెంట్, సక్సెస్, ఫెయిల్యూర్ ఆఫ్ ప్రెసెంట్ స్టార్టప్, కాంపిటీషన్, టెక్నికల్ ప్రజంటేషన్, కొలాబరేటివ్, రీసెర్చ్ ప్రాజెక్ట్, వర్క్‌షాప్, వెబినార్స్ వంటి వాటిపై కూడా అవగాహన కల్పించన్నారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ అశోక్‌కుమార్, డీన్ డాక్టర్ రామిరెడ్డి, హెచ్‌ఓడీ భాస్కరరెడ్డి, డాక్టర్ సతీష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

వక్తృత్వ పోటీల్లో ప్రతిభ

నంద్యాల, నవంబరు 29 : (ఆంధ్రజ్యోతి): రాయలసీమ జోనల్ స్థాయి వక్తృత్వ పోటీల్లో నంద్యాలలోని గురురాజ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరచి పతకాలు సాధించారని గురురాజ పాఠశాల డైరెక్టర్ షేక్షావలిరెడ్డి శుక్రవారం తెలిపారు. రాష్ట్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకొని కడపలో జరిగిన రాయలసీమ స్థాయి వక్తృత్వ పోటీల్లో తమ విద్యార్థి తారకేశ్వర్ ప్రథమ, పాటల పోటీల్లో మహమ్మద్ రఫి తృతీయ బహుమతిని సాధించినట్లు చెప్పారు. పతకాలు సాధించిన విద్యార్థులను గురురాఘవేంద్ర విద్యాసంస్థల చైర్మన్ డా.దస్తగిరిరెడ్డి, డైరెక్టర్లు మౌలాలిరెడ్డి, షేక్షావలిరెడ్డి అభినందించారు.

మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- తబ్లిగీ ఇజితెమాకు ప్రభుత్వ సహకారం
- రూ. 1.50 కోట్లతో మౌలిక సదుపాయాల కల్పన
- సమీక్షలో వెల్లడించిన మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్, ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి



సమావేశానికి హాజరైన ముస్లింలు




ఏర్పాట్లను పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

ఆత్మకూరు రూరల్, నవంబరు 29: మైనారిటీల సంక్షేమం, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర మైనారిటీ శాఖ, న్యాయశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణ శివార్లలోని పెద్ద మదరసా ప్రాంతంలో జనవరి 7,8 న నిర్వహించనున్న తబ్లిగీ ఇజితేమాలో మౌలిక సదుపాయాల కల్పన కోసం కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణాతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మైనారిటీలతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. అనంతరం మంత్రి ఫరూక్ మాట్లాడుతూ.. ప్రధానంగా గత టీడీపీ ప్రభుత్వ హయాంలో సీఎం చంద్రబాబు మైనారిటీ కార్పొరేషన్, హజ్ హౌస్, దుకాన్, మకాన్, దుల్హన్ పథకం, షాదీఖానాల ఏర్పాటు, రంజాన్ తోఫా, మసీదులకు మరమ్మతులకు నిధులు తదితర సంక్షేమ పథకాలు ఏర్పాటు చేసి మైనారిటీల సంక్షేమానికి పాటు పడ్డారన్నారు. ఎమ్మెల్యే బుడ్డా మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతంలోని పలు జిల్లాల నుంచి దాదాపు 3 లక్షల మంది మైనారిటీలు రానున్నారని, వారికి అన్ని సౌకర్యాలు కల్పించి ఆ ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామని చెప్పారు. తాను మంత్రి ఫరూక్‌తో కలిసి సీఎం చంద్రబాబును కలిశామని, ఈ మేరకు రూ. 1.50 కోట్ల నిధులను కోరామని ఇందుకు సానుకూలంగా స్పందించిన సీఎం ఆ నిధులను మంజూరు చేశారని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ రత్నరాధిక, ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, డీఎస్పీ రామాంజినాయక్, సీఐ సురేష్ కుమార్‌రెడ్డి,మండల స్థాయి అధికారులు, ఇజితెమా కమిటి సభ్యులు హబీబుల్లా, అమీర్ సాహెబ్, నూర్ బేగ్,గౌస్‌లాజం,మౌళానా రహంతుల్లా,షాలిఫైల్వాన్, ఇషాక్, ఇజితెమా కమిటి వలంటీర్లు, ముస్లిం మైనారిటీలు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పెచ్చూలూడుతున్న తహసీల్దార్ కార్యాలయం

- భయాందోళనలో సిబ్బంది



పెచ్చులూడిన భవనం పైకప్పు

పగిడ్యాల, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాలకు చెందిన ప్రజలకు రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం మండల కేంద్రాలలో ఏర్పాటు చేసిన తహసీల్దార్ కార్యాలయం శిథిలావస్థకు చేరుకొని ప్రమాదకరంగా మారాయి. దీంతో సిబ్బంది విధులు నిర్వహించేందుకు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. అందుకు నిదర్శనం పగిడ్యాల తహసీల్దార్ కార్యాలయంలోని పలు గదులు పెచ్చులాడుతూ ప్రమాదకరంగా ఉండటమే. మండలంలోని వివిద గ్రామాలకు చెందిన ప్రజలు, రైతులకు రెవెన్యూ సమస్యలను పరిష్కరించేందుకు పగిడ్యాలలో సుమారు 30 ఏళ్ల కు పైగా తహసీల్దార్ కార్యాలయాన్ని నిర్మించినట్లు సమాచారం. కార్యాలయం నిర్మించి ఎక్కువ రోజులు కావడంతో డిప్యూటీ తహసీల్దార్, సీనియర్ అసిస్టెంట్, వీఆర్వో, ఆర్ఐలు కూర్చునే గదితో పాటు రికార్డులు భద్రపరుచుకునేందుకు నిర్మించిన గదులు శిథిలావస్థకు చేరుకున్నాయి. గదులలో పైన పెచ్చులాడి పడటంతో ఇనుప కడ్డీలు బయటకు రావడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదాలు జరుగుతాయోనని కార్యాలయ సిబ్బంది భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. గదులు శిథిలావస్థకు చేరుకోవడంతో సిబ్బంది వరండాలలో కూర్చొని బిక్కుబికుమంటూ విధులు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. వర్షాలు కురిసినప్పుడు గదులలో వర్షపు నీరు కారడంతో కార్యలయంలో భద్రపరిచిన పలు రికార్డులు తడిసిపోవడంతో పాటు సిబ్బంది విధులు నిర్వహించేందుకు ఇబ్బందులు తప్పడం లేదు. గతంలో కంప్యూటర్‌గది పెచ్చూలూడిపడటంతో త్రుటిలో సిబ్బంది ప్రమాదం నుంచి బయటపడిన ఘటనలు ఉన్నాయాని పలువురు ఆరోపిస్తున్నారు. ఇటీవల పగిడ్యాల తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలించిన నందికొట్కూరు ఎమ్మెల్యే అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యాలయంలోని పలు గదులకు మరమ్మతులు చేపట్టేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. జిల్లా అధికారులు చర్యలు తీసుకోని శిథిలావస్థకు చేరుకున్న తహసీల్దార్ కార్యాలయాన్నికి మరమ్మతులు చేపట్టాలని మండల ప్రజలు, కార్యాలయ సిబ్బంది కోరుతున్నారు.

నందవరంలో చండీ యాగం



చండీయాగంలో పాల్గొన్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి దంపతులు

బనగానపల్లె ,నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రజలు సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థిస్తూ మండలంలోని చౌడే శ్వరీమాత ఆలయంలో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, బీసీ ఇందిరమ్మ దపంతులు శుక్రవారం చండీయాగం చేశారు. ముందుగా మంత్రి బీసీ దంపతులకు ఆల య సిబ్బంది, పూజారులు, టీడీపీ మండల అధ్యక్షుడు పీవీ.కుమార్‌రెడ్డి పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అమ్మవారికి పట్టు వస్త్రాలు బీసీ దంపతులు సమర్పించారు. చౌడేశ్వరీ అమ్మవారికి బీసీ దంపతులు ప్రత్యేక పూజలు చే శారు. వేదపండితుల ఆధ్వర్యంలో చండీయాగం నిర్వహించారు. మాలధారు లకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా చౌడేశ్వరీమాత పల్లకీసేవ

చౌడేశ్వరీమాత పల్లకీసేవ సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఆలయ సిబ్బందితో పాటు, ఆలయ మాజీ చైర్మన్ పీవీ.కుమార్‌రెడ్డి, ఆలయ పూజారులు, భక్తుల ఆధ్వర్యంలో అమ్మవారిని పల్లకీలో అమ్మవారిని ఊరేగించారు. భక్తులు పల్లకీసేవలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

కాల్వబుగ్గలో నేడు కార్తీక వన భోజనం

- హాజరు కానున్న ప్రముఖులు
- ఏర్పాట్లను పరిశీలించిన నాయకులు, అధికారులు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మల్లెల రాజశేఖర్, పోలీసు అధికారులు

ఓర్వకల్లు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసాన్ని పురస్కరించుకొని మండలంలోని కాల్వ బుగ్గరామేశ్వర క్షేత్రంలో తెలుగు దేశం పార్టీ ఆధ్వర్యంలో శనివారం వనభోజనం నిర్వహించనున్నారు. టీటీడీ పాలక మండలి సభ్యుడు మల్లెల రాజశేఖర్ పర్యవేక్షణలో జరిగే ఈ కార్యక్రమానికి పలువురు మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు హాజరు కానున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో కార్యక్రమం ఏర్పాట్లను శుక్రవారం మల్లెల రాజశేఖర్, దేవస్థానం ఈవో మద్దిలేటి, కర్నూలు రూరల్ సీఐ చంద్రబాబునాయుడు, ఎస్ఐ సునీల్ కుమార్‌లు పరిశీలించారు. కార్యక్రమంలో నాయకులు కేవీ మధు, సుధాకర్, కాటినేని నారాయణ, నాగభూషణం శెట్టి, అబ్బి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

కార్తీక వన భోజనానికి తరలిరండి: కాల్వబుగ్గ దేవస్థానం వద్ద ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి సూచనతో కార్తీక వనభోజన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించనున్నట్లు టీటీడీ పాలకమండలి సభ్యుడు మల్లెల రాజశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి పాణ్యం నియోజకవర్గంలోని అన్ని మండలాల టీడీపీ నాయకులు, క్లస్టర్, యూనిట్, అర్బన్ వార్డు ఇన్‌చార్జిలు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ



అల్లూరు గ్రామంలో చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే

నందికొట్కూరు రూరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు మండలంలోని అల్లూరులో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి వచ్చిన రూ.38,727 చెక్కును అలంపూరు మధుసూదన నాయుడుకు ఎమ్మెల్యే జయసూర్య, మాండ్ర సురేంద్రనాథరెడ్డి, గ్రామ సర్పంచ్ చిన్న నాగలక్ష్మయ్య అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల వారి వైద్య ఖర్చులను కూటమి ప్రభుత్వం భరిస్తూ ప్రజల యోగక్షేమాల కోసం పనిచేస్తోందని అన్నారు. గ్రామాల అభివృద్ధిలో కూడా రాజీ పడడం లేదన్నారు. నియోజకవర్గంలో పేదల కష్టాలను చూశానని అన్నారు. పేదవారికి ఏ కష్టమొచ్చినా తర దృష్టికి తెస్తే పరిష్కరించడానికి తనవంతు కృషి చేస్తానన్నారు.

'ఎంఎస్ఎంఈ సర్వే త్వరగా పూర్తి చేయాలి'



సర్వే చేస్తున్న డిప్యూటీ సీఈవో, డీఆర్‌డీఏ పీడీ

జూపాడుబంగ్లా, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో గుర్తించిన ఎంఎస్ఎంఈ (సూక్ష్మ, మధ్యతరహా) పరిశ్రమలు, దుకాణాలు 554 ఉన్నాయని, త్వరితగతిన సర్వేచేసి పూర్తిచేసి నివేదిక అందజేయాలని జడ్పీ డిప్యూటీ సీఈవో సుబ్బారెడ్డి అన్నారు. జూపాడుబంగ్లాలో చేస్తున్న సర్వేలో భాగంగా డిప్యూటీ సీఈవో సుబ్బారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి పాల్గొని పరిశీలించారు. వారు మాట్లాడుతూ ప్రతి దుకాణాన్ని పరిశీలించి వారి వివరాలు, ఆదాయం, దుకాణం ద్వారా ఎంతమందికి ఉపాధి లభిస్తుందనే తదితర విషయాలను పరిగణలోకి తీసుకుని సర్వేచేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో గోపీకృష్ణ, అసిస్టెంట్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

లక్ష్యంతో చదవాలి: డీఈవో



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో జనార్దన్‌రెడ్డి

నందికొట్కూరు రూరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): లక్ష్యంతో చదవాలని డీఈవో జనార్దన్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. నందికొట్కూరు మండలంలోని అల్లూరు గ్రామంలో శుక్రవారం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను డీఈవో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సరైన సమయానికి పాఠశాలకు రావాలని, ప్రతిరోజు తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రతి విషయంలో గమనిస్తూ ఉండాలన్నారు. సమయానికి పాఠశాలకు పంపే బాధ్యత తల్లిదండ్రులదేనని అన్నారు. పేరెంట్స్ మీటింగ్‌కు తప్పనిసరిగా హాజరు కావాలని తల్లిదండ్రులకు సూచించారు. పాఠశాల అభివృద్ధికి అందరూ తోడ్పాటనందిం చాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాసులు, హెచ్ఎం మద్దిలేటి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

డాక్టర్ జ్యోతిప్రసాద్ గంగూలి స్మారక పురస్కారానికి నంద్యాల వైద్యుడి ఎంపిక



డాక్టర్ రవికృష్ణ

నంద్యాల, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): నంద్యాలకు చెందిన ప్రముఖ అనస్థీషియా వైద్యుడు, ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ ప్రతిష్టాత్మక జాతీయ ఐఎంఏ పురస్కారానికి ఎంపికయ్యారు. 25 ఏళ్లుగా సామాజిక సేవకు ఐఎంఏ జాతీయ స్థాయి గుర్తింపును ఇచ్చింది. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రతి ఏటా జాతీయ మహాసభల సందర్భంగా ప్రదానం చేసే పురస్కారాలను శుక్రవారం ఢిల్లీలో ప్రకటించారు. జాతీయ స్థాయిలో ఏటా నిస్వార్థ సామాజిక సేవలు చేసిన ఒకరికి ప్రకటించే ప్రతిష్టాత్మక డా.జ్యోతిప్రసాద్ గంగూలీ స్మారక పురస్కారానికి ఈ ఏడాది డా.రవికృష్ణను ఐఎంఏ జాతీయ అధ్యక్ష, కార్యదర్శులు డా.అశోకన్, డా.అనిల్‌నాయక్ అధికారికంగా ప్రకటించారు. ఈ పురస్కారాన్ని డిసెంబరు 27, 28వ తేదీల్లో హైదరాబాద్‌లో జరగనున్న 99వ ఐఎంఏ జాతీయ మహాసభల్లో ఈ పురస్కారాన్ని తీసుకోనున్నట్లు డా.రవికృష్ణ తెలిపారు. పురస్కారానికి ఎంపికైన సందర్భంగా ఐఎంఏ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు డా.నందకిశోర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.సుభాష్‌చంద్రబోస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా.విజయభాస్కర్‌రెడ్డి, రాష్ట్ర శాఖ సభ్యులు నంద్యాల జిల్లా ఐఎంఏ అధ్యక్ష, కార్యదర్శులు డా.మధుసూదన్‌రావు, డా.ఫనిల్‌కుమార్‌లు అభినందించారు.

'డంపింగ్ యార్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి'



నిలిచిపోయిన డంపింగ్ యార్డును చూపుతున్ననాయకులు

పగిడ్యాల, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని పడమర ప్రాతకోట గ్రామంలో అసంపూర్తిగా ఉన్న డంపింగ్‌యార్డు నిర్మాణానికి అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల కన్వీనర్ పక్కీర్‌సాహెబ్ డిమాండ్ చేశారు. ప్రాతకోట గ్రామంలో మధ్యలో నిలిచిపోయిన డంపింగ్ యార్డును సీపీఎం నాయకులు శుక్రవారం సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ఏళ్ల తరబడి డంపింగ్‌యార్డు పనులు పూర్తి చేయకపోవడంతో చెత్త, చెదారం రోడ్లపై పడవేయడంతో అపరిశుభ్రంగా మారాయని ఆయన ఆరోపించారు. గతంలో పనులు చేపట్టిన కాంట్రాక్టరుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బాబు, సుంకన్న, శివకుమార్, జిలానీ, లక్ష్మీదేవి, తదితరులు ఉన్నారు.

శివాలయాల్లో కార్తీక పూజలు





మహానందిలో గోపూజ, శంఖులతో శివలింగం అలంకారం



శ్రీశైలంలో పూజలు చేస్తున్న అర్చకులు



ఆత్మకూరులో పార్వతి పరమేశ్వరుల కళ్యాణం



నంద్యాలలో లక్ష బిల్వార్చనలో పాల్గొన్న భక్తులు

మహానంది, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో కార్తీక మాసం ముగింపు పురస్కరించుకొని శుక్రవారం ప్రధాన గర్భాలయంలో అత్యంత వైభవంగా లక్ష బిల్వార్చన కార్యక్రమాన్ని ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, విజయ దంపతుల ఆధ్వర్యంలో వేదపండితులు నిర్వహించారు. ఉదయం వేదమంత్రాలతో గోపూజ, గణపతి పూజ, పుణ్యాహవచనంతో పాటు మహన్యాసక పూర్వక రుద్రాభిషేకకాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. లక్ష బిల్వార్చన దాతలు నంద్యాల రామకృష్ణ కళాశాలల అధినేత గడ్డం రామకృష్ణారెడ్డి, విజయకుమారి దంపతులతో పాటు ఆలయ ఏఈవో ఎర్రమల్ల మధు, గాయత్రి దంపతులతో పాటు భక్తులు పాల్గొన్నారు.

శంఖ పూజ: మహానంది ఆలయంలో శుక్రవారం రాత్రి ప్రత్యేక ఋత్వికులు భక్తి శ్రద్ధలతో అష్టోత్తర శంఖ పూజను నిర్వహించారు. ప్రత్యేకంగా తెప్పించిన శంఖలను ప్రధాన ఆలయం ముందు భాగంలో పూల అలంకారం మధ్య శివలింగాకారంలో అలంకరించారు.

నేడు లక్ష కుంకుమార్చన: కామేశ్వరీదేవికి శనివారం లక్ష కుంకుమార్చన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. రాత్రి స్వామి, అమ్మవార్లకు ఆలయ ప్రాంగణంలోని అభిషేక మంటపంలో శాంతి కల్యాణం నిర్వహించడంతో మహానందిలో కార్తీక మాసోత్సవాలు ముగుస్తాయని ఈవో తెలిపారు.

సంగమేశ్వరంలో..

కొత్తపల్లి: వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలిరావడంతో సప్తనది తీరంలో భక్తజన సందడి నెలకొంది. శుక్రవారం భక్తులు భారీగా తరలివచ్చి సంగమేశ్వరుడిని దర్శించుకున్నారు. ఎగువ ఉమామహేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఆలయ పురోహితుడు తెలకపల్లి రఘురామశర్మ స్వామికి అభిషేకాలు, హోమాలు, గంగామాతకు ప్రత్యేక పూజలు భక్తులతో చేయించారు. అలాగే భక్తులు కొలనుభారతి అమ్మవారిని దర్శించుకున్నారు.



సంగమేశ్వరంలో..

శ్రీశైలంలో..

శ్రీశైలం: శ్రీశైలం మహాక్షేత్రంలో లోకకల్యాణార్థం శుక్రవారం స్వామి, అమ్మవార్లకు ఊయల సేవను వైభవంగా నిర్వహించారు. గ్రామదేవత అంకాలమ్మకు శుక్రవారం విశేష పూజలను దేవస్థానం నిర్వహించింది. అమ్మవారికి పంచామృతాభిషేకం, హరిద్రోదకం, కుంకుమోదకం, గంధోదకం, పుష్పోదకం, విశేష అలంకరణ, కుంకుమార్చన పూజలు నిర్వహించారు.

నంద్యాలలో..

నంద్యాల కల్చరల్: నంద్యాల సంజీవనగర్ కోదండ రామాలయంలో లోక కళ్యాణం కోసం కాశీవిశేశ్వరుడికి, అమ్మవారిశాలలోని నగరేశ్వర స్వామికి లక్ష బిల్వార్చన కార్యక్రమం నిర్వహించారు. సంజీవనగర్ రామాలయంలో భగవత్ సేవా సమాజ్ ప్రాంగణంలో స్మార్తపండిట్ యడవల్లి కార్తికేయ శర్మ అర్చ కత్వంలో లక్షబిల్వార్చన కార్యక్రమం నిర్వహించారు. భగవత్ సేవా సమాజ్ కమిటీ అధ్యక్షుడు సముద్రాల సూరయ్య, సభ్యులు పార్థసారథికృష్ణ, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు భవనాశి శ్రీనివాస, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

- నంద్యాలలో శుక్రవారం సాయంత్రం ప్రథమనందీశ్వరాలయంలో శివపార్వతుల కళ్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రంలో అర్చకులు ప్రవీణ్, భక్తులు పాల్గొన్నారు.

ఆత్మకూరులో..

ఆత్మకూరు రూరల్: ఆత్మకూరులోని ఉమామహేశ్వరస్వామి దేవస్థానంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పార్వతీపరమేశ్వరుల కళ్యాణ మహోత్సవం కమనీయంగా సాగింది. ఆలయ పురోహితులు శరత్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు గంగాధరరెడ్డి, శేషఫణి, శ్రీను, గంగాధర్, ఏవీ సుబ్బారెడ్డి, లక్ష్మిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, దామోదర్ రమేష్ ఉన్నారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

ఇష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు



సమావేశంలో మాట్లాడుతున్న భూమా జగత్ విఖ్యాతరెడ్డి

చాగలమర్రి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఇష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని టీడీపీ ఆళ్లగడ్డ యువనాయకుడు భూమా జగత్ విఖ్యాతరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ముత్యాలపాడు బర్డ్స్ ఉన్నత పాఠశాలలో అదనపు భవనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థకు భూమా కుటుంబం సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం భూమా జగత్‌ను బర్డ్స్ యాజమాన్యం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బర్డ్స్ సంస్థల అధినేత పాల్‌రాజరావు, ఎంఈవో న్యామతుల్లా, హెచ్ఎం సింధూర, ఎస్పీజీ హెచ్ఎంలు జీవలత, నళిని, అనంతరామ సుబ్బారెడ్డి, తాలుకా ప్రైవేటు పాఠశాలల అధ్యక్షుడు అమీర్‌బాష, విశ్రాంత డీఎఫ్‌వో చాణిక్యరాజు, అన్సర్‌బాషా, లాయర్ నరసింహారెడ్డి, రమణారెడ్డి, బ్రహ్మం, జెట్టినాగరాజు, మౌలాలి, సురేష్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, శేఖర్‌రెడ్డి, రఘునాథ్‌రెడ్డి, శివారెడ్డి, జల్సాగోస్ పాల్గొన్నారు.

వరి పంట కోత ప్రయోగాలు


తూకాన్ని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మురళీక్రిష్ణ

కోవెలకుంట్ల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఇంటిగ్రేటెడ్ అగ్రిల్యాబ్‌లో వచ్చే సంవత్సరం నుంచి ఎరువులు, విత్తనాల పరీక్షలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని నంద్యాల జిల్లా వ్యవసాయాధికారి మురళీక్రిష్ణ తెలిపారు. శుక్రవారం కోవెలకుంట్ల గ్రామంలో నారా రాజశేఖర్ రెడ్డి పొలంలో వరి పంట కోత ప్రయోగం నిర్వహించారు. సరాసరి దిగుబడి 32 బస్తాలు వచ్చినట్లు తెలిపారు. అలాగే వ్యవసాయ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతి రైతు పంటల బీమా ప్రీమియం చెల్లించాలని అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో సిబ్బంది పాల్గొన్నారు.

సూక్ష్మ సేద్యానికి ప్రభుత్వ ప్రోత్సాహం


సబ్సిడీ పైపులు పంపిణీ చేస్తున్న వీఆర్ లక్ష్మీరెడ్డి

కొలిమిగుండ్ల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : రైతులకు ఎంతో ఉపయోగకరమైన సూక్ష్మ సేద్యం పథకానికి టీడీపీ ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహం అందిస్తున్నట్లు టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త వీఆర్ లక్ష్మీరెడ్డి అన్నారు. శుక్రవారం రాఘవరాజుపల్లె గ్రామానికి చెందిన రైతు అంబటి నరసింహారెడ్డికి సబ్సిడీ కింద మంజూరైన రూ.50వేలు విలువ చేసే సూక్ష్మ సేద్యం పరికరాలు, పైపులు తదితర వాటిని వీఆర్ లక్ష్మీరెడ్డి పంపిణీ చేశారు. మంత్రి బీసీ ఆధ్వర్యంలో రైతులకు అన్నివిధాలా అండగా ఉంటామని వీఆర్ లక్ష్మీరెడ్డి అన్నారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయండి: ఈఈ

చాగలమర్రి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పక్కా గృహాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని హౌసింగ్ ఈఈ హరిగోపాల్ అన్నారు. శుక్రవారం చాగలమర్రిలోని కస్తూర్బా సమీపంలోని లేఔట్లలో నిర్మించుకున్న పక్కా గృహాలను పరిశీలించారు. లబ్ధిదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బేస్‌మెంట్ వేసుకున్నవారు డిసెంబరు చివరి నాటికి గృహాలు పూర్తి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ విజయ్‌బాబు, వర్క్‌ఇన్‌స్పెక్టర్ ఓబులేసు పాల్గొన్నారు.

తెలుగుగంగ కాల్వలో మోటారు సైకిల్ లభ్యం

రుద్రవరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోటకొండ సమీపంలో తెలుగుగంగ ప్రధాన కాల్వలో నీటి సరఫరా నిలిచిపోవడంతో మోటారు సైకిల్ శుక్రవారం బయటపడినట్లు ఏఎస్ఐ బాలన్న తెలిపారు. గ్రామస్తుల సహకారంతో కాల్వ నుంచి మోటారు సైకిల్‌ను బయటకు తీసి పోలీసుస్టేషన్‌కు తరలించారు. పూర్తిగా విచారించి వివరాలు వెల్లడిస్తామని ఏఎస్ఐ తెలిపారు.

పీఆర్‌టీయూ నూతన కార్యవర్గం ఎన్నిక


ప్రమాణం చేస్తున్న కార్యవర్గ సభ్యులు

బనగానపల్లె, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): బనగానపల్లె పట్టణంలో పీఆర్‌టీయూ మండల కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుల్లారెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర కౌన్సిలర్ ప్రసాదరెడ్డి ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించారు. మండల అధ్యక్షుడుగా దస్తగిరి ప్రధాన కార్యదర్శిగా అబ్దుల్ ఫరీఫ్, అసోసియేట్ అధ్యక్షుడిగా నాగేశ్వరరెడ్డి, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాసరెడ్డి, మహిళా ఉపాధ్యక్షురాలుగా లక్ష్మీనారాయణమ్మ, క్యాదర్శిగా సురేశ్, సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మండల నాయకులు ముకుందారెడ్డి, భాస్కర్‌రెడ్డి, రఫీ, బాల మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

గౌడ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వన మహోత్సవం

బనగానపల్లె, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): బనగానపల్లె పట్టణంలో శుక్రవారం గౌడ సంఘం కార్తీకవన మహోత్సవం కార్యక్రమం రవ్వల కొండపై వెలసిన హట్టిమునిస్వామి ఆలయంలో నిర్వహించారు. సామూహిక గోమాత పూజ, కులదేవత రేణుకా ఎల్లమాంబ విగ్రహానికి కుంకుమార్చన ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు తిరుపాల్‌గౌడ్, దేవుడు, హెచ్ఎం హరినాథగౌడ్, దొంతా వెంకటేశ్వర్లు, గౌడ సంఘీయులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరిహారం చెల్లింపు

కొలిమిగుండ్ల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : రామ్‌కో సిమెంట్ పరిశ్రమలో ఈనెల 3న జరిగిన ప్రమాదంలో మృతి చెందిన కార్మికుడు సురేష్‌ఆచారి కుటుంబానికి పరిశ్రమ అండగా నిలిచింది. శుక్రవారం ధన్నవాడ గ్రామాకి చెందిన సురేష్ తల్లి సుబ్బమ్మ, సోదరుడికి రూ.25 లక్షల చెక్కును యూనిట్ హెడ్ రెడ్డి నాగరాజు అందజేశారు. కార్యక్రమంలో అడ్మిన్ హెడ్ రామరాజు, సీనియర్ జీఎం రవికుమార్ ఉన్నారు.

సారా విక్రేతల అరెస్టు

ప్యాపిలి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్యాపిలి మండలం ఆలేబాదు తండా శివారులో డోన్ ఎక్సైజ్ పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించి ఇద్దరు సారా విక్రేతలను అరెస్టు చేశారు. డోన్ ఎక్సైజ్ సీఐ వరలక్ష్మి, ఎస్ఐ సోమశేఖర్‌రావు, దౌలత్‌ఖాన్, హెడ్ కానిస్టేబుల్ లక్ష్మినారాయణ, సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

కోవెలకుంట్ల : మద్యం విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ టకీ బాషా తెలిపారు. ఎస్ఐలు సందీప్ ప్రవీణ్ కుమార్, సిబ్బంది ఉన్నారు.

వైద్యులు సరే.. విధులు ఎలా?

- ముత్యాలపాడుకు పీహెచ్‌సీ కేటాయింపు
- సొంత భవనం లేక అవస్థలు

చాగలమర్రి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్యాలపాడు గ్రామంలో నూతన పీహెచ్‌సీని కేటాయించి దాదాపు ఏడాది పూర్తయిన నేటికీ భవన నిర్మాణం జరగలేదు. గ్రామంలోని ఆరోగ్య ఉపకేంద్రం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. గత వైసీపీ ప్రభుత్వంలో ముత్యాలపాడుకు పీహెచ్‌సీని కేటాయించి వైద్యులను నియమించారు. అరకొరగా సిబ్బందిని ఏర్పాటు చేశారు. రోగులకు మాత్రం వైద్య సేవలు అందించేందుకు సొంత భవనం లేకపోవడంతో పాత గ్రామ పంచాయతీ కార్యాలయంలో వైద్యులు విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వమైన ముత్యాలపాడులో ఆసుపత్రి నిర్మాణానికి నిధులు కేటాయించి ప్రజలకు వైద్య సేవలు సక్రమంగా అందేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు. సాధారణంగా ఆసుపత్రిని ఏర్పాటు చేస్తే 14మంది సిబ్బందిని కేటాయించాలి. వైసీపీ ప్రభుత్వం ఆర్భాటంగా ఆసుపత్రిని కేటాయిస్తున్నట్లు చెప్పి కేవలం ఇద్దరు వైద్యులు, ఒక సూపర్‌వైజర్‌ను మాత్రమే నియమించింది. ఒక వైద్యుడు డిప్యుటేషన్‌పై ఇతర ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్నారు. ఉన్న ఒక్కరు ముత్యాలపాడు పరిధిలోకి వచ్చే ఎనిమిది సచివాలయాల్లో ఎఫ్‌డీపీలో పాల్గొనేందుకు 20 రోజులు కేటాయిస్తున్నారు. ఉన్న పది రోజులు స్థానికంగా విధులు నిర్వహిస్తున్నారు.


ముత్యాలపాడులో శిథిలావస్థలో ఆరోగ్య ఉప కేంద్రం


ముత్యాలపాడు పంచాయతీ కార్యాలయంలో వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది(ఫైల్)

- **ఆరోగ్య కేంద్రం శిథిలం**

ముత్యాలపాడులో ఆరోగ్య ఉప కేంద్రం ఆసుపత్రి భవనం శిథిలావస్థకు చేరింది. భవనం పెచ్చులూడి పడుతోంది. ఆవరణ మొత్తం కంప చెట్లు, ముళ్ల పొదలు పెరగడంతో అక్కడ వైద్య సిబ్బంది విధులు నిర్వహించడం లేదు.

పూర్తిగా సిబ్బందిని కేటాయించలేదు

ముత్యాలపాడులోని పీహెచ్‌సీ పరిధిలో పని చేయాలని గత ఏడాది విధుల్లోకి తీసుకున్నారు. పీహెచ్‌సీకి ఉండాల్సిన సిబ్బంది మొత్తంగా లేరు. కేవలం ఇద్దరు వైద్యులు, ఒక సూపర్‌వైజర్ మాత్రమే ఉన్నారు. భవనం లేక పోవడంతో ప్రస్తుతం పంచాయతీ కార్యాలయ ఆవరణలో విధులు నిర్వహిస్తున్నారు. భవనం లేని విషయం జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

- సుల్తానా, వైద్యురాలు, ముత్యాలపాడు

వైభవంగా స్వాతి మహోత్సవం

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), నవంబరు 29(ఆంధ్రజ్యోతి) : ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన అహోబిలంలో స్వాతి మహోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. నరసింహ స్వామి జన్మ నక్షత్రమైన స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని దిగువ అహోబిలంలోని శ్రీదేవి, భూదేవి సమేత ప్రహ్లాదవరదస్వామి ఉత్సవ మూర్తులను యాగశాలలో కొలువుదీర్చి అభిషేకం, తిరుమంజనం నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు ఎదురుగా ఏర్పాటు చేసిన హోమగుండంలో శాస్త్రోక్తంగా సుదర్శన హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించి అర్చకులు ప్రత్యేక పూజలు, కల్యాణం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు స్వాతి వేడుకల్లో పాల్గొన్నారు. శ్రీదేవీ, భూదేవీ సమేత ప్రహ్లాద వరద స్వామి ఉత్సవ మూర్తులను సా యంత్రం పల్లకిలో కొలువుంచి మాడ వీధుల్లో గ్రామోత్సం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు కిడాంబి వేణుగోపాలన్, మణియార్ సౌమ్యానారాయణన్ ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి.


నరసాపురంలో స్వాతి వేడుకలకు ముస్తాబైన లక్ష్మీనరసింహ స్వామి, లక్ష్మీదేవి అమ్మవారు


అహోబిలంలో సుదర్శన హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

రుద్రవరం : మండలంలోని నరసాపురం, రుద్రవరం గ్రామాల్లోని దొర్ని, గుట్టకొండ నరసాపురం గ్రామాల్లోని లక్ష్మీనరసింహస్వామి దేవాలయాల్లో శుక్రవారం స్వాతి వేడుకలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని దేవాలయాల్లో అర్చకులు అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు. వివిధ ప్రాంతాలనుంచి తరలివచ్చిన భక్తులుస్వామి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు.

నందవరంలో చండీ యాగం

బనగానపల్లె ,నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రజలు సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థిస్తూ మండలంలోని చౌడేశ్వరీమాత ఆలయంలో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, బీసీ ఇందిరమ్మ దపంతులు శుక్రవారం చండీయాగం చేశారు. ముందుగా మంత్రి బీసీ దంపతులకు ఆలయ సిబ్బంది, పూజారులు, టీడీపీ మండల అధ్యక్షుడు పీవీ.కుమార్‌రెడ్డి పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అమ్మవారికి పట్టు వస్త్రాలు బీసీ దంపతులు సమర్పించారు. చౌడేశ్వరీ అమ్మవారికి బీసీ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితుల ఆధ్వర్యంలో చండీయాగం నిర్వహించారు. మాలధారులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా చౌడేశ్వరీమాత పల్లకీసేవ

చౌడేశ్వరీమాత పల్లకీసేవ సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఆలయ సిబ్బందితో పాటు, ఆలయ మాజీ చైర్మన్ పీవీ.కుమార్‌రెడ్డి, ఆలయ పూజారులు, భక్తుల ఆధ్వర్యంలో అమ్మవారిని పల్లకీలో అమ్మవారిని ఊరేగించారు. భక్తులు పల్లకీసేవలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.


చండీయాగంలో పాల్గొన్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి దంపతులు

దోమలతో ప్రజలు అల్లాడిపోతున్నారు

- సమావేశంలో కౌన్సిలర్ల ఆవేదన

బేతంచెర్ల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సంజీవనగర్ కాలనీలో డ్రైనేజీలు శుభ్రం చేయకపోవడంతో దోమల బెడద అధికమైందని దాంతో ప్రజలు అల్లాడిపోతున్నారని టీడీపీ కౌన్సిలర్ ఆంజనేయులు, వైసీపీ కౌన్సిలర్ మహేశ్వరమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం సాధారణ కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. టీడీపీ కౌన్సిలర్ రామాంజనేయులు మాట్లాడుతూ తమ కాలనీలో తాగునీటి సమస్య ఉందని తెలిపారు. అలాగే కౌన్సిలర్లు పలు సమస్యలను సభ దృష్టికి తీసుకవచ్చారు. ఈ సందర్భంగా కమిషనర్ హరిప్రసాద్ మాట్లాడుతూ త్వరలో డ్రైనేజీలను శుభ్రం చేయిస్తామని హామీ ఇచ్చారు. సమస్యలను కూడా పరిష్కరిస్తామన్నారు. కౌన్సిల్ ఆమోదం కోసం అజెండా అంశాలను కార్యాలయ సిబ్బంది చదివి వినిపించారు. అదేవిధంగా 2024-26 రెండేళ్ల బడ్జెట్ వివరాలను గురించి బిల్ కలెక్టర్ చదివి సభ్యులకు వినిపించారు. ప్రజలు తాగునీటి సమస్య పరిష్కారానికి నగర పంచాయితీ బిల్లులు ఎంత మేర ఖర్చు వివరాలు కౌన్సిలర్ ఇబ్రహీం అడిగి తెలుసుకున్నారు. వైస్ చైర్మన్ పర్వీన్ మాట్లాడుతూ నగర వార్డులో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తామని తెలిపారు. సమావేశంలో కార్యాలయ సిబ్బంది, కోఆప్షన్ సభ్యులు ఆయా వార్డుల కౌన్సిలర్లు హాజరయ్యారు. సీఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ హరిప్రసాద్

కమనీయం.. శివపార్వతుల కల్యాణం


చాగలమర్రి పాత శివాలయంలో శివపార్వతుల కల్యాణం చేస్తున్న వేద పండితులు

చాగలమర్రి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని పాత శివాలయంలో మాస శివరాత్రి కార్తీకమాసం ముగింపు సందర్భంగా శుక్రవారం రాత్రి శివపార్వతుల కల్యాణం కమణీయంగా సాగింది. వేద పండితుడు పవన్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో సల్లా నాగరాజు, శివశంకర్, మల్లికార్జున, రవికుమార్ దంపతులు స్వామి, అమ్మవార్ల కల్యాణం జరిగించారు. అనంతరం కమిటీ సభ్యులు, భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అభినవ శంకరానందస్వామి, ఆలయ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

భీమలింగేశ్వర ఆలయంలో..

చాగలమర్రి గ్రామంలోని భీమలింగేశ్వర ఆలయంలో శుక్రవారం మాస శివరాత్రి కార్యక్రమాన్ని మహిళలు ఘనంగా నిర్వహించారు. పార్వతీదేవికి సామూహికంగా ఒడిబియ్యం సమర్పించారు. దీపాలు వెలిగించి దీపోత్సవం చేశారు. పాత శివాలయంలో సంయోజిత కన్వీనర్ లక్ష్మీదేవి, భవాని ఆధ్వర్యంలో ఆకాశదీపం పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

డోన్ రూరల్: పట్టణంలోని కొండపేటలో వెలసిన ఎల్లమాంబేశ్వరి దేవి ఆలయ ప్రాంగణంలో శుక్రవారం కార్తీ క మాస మహోత్సవాలు భక్తులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు సోమన్నగౌడు, ఎమ్మార్పీఎస్ నాయకులు భూమానాగన్న పాల్గొన్నారు. భక్తులకు ఏఈ నాగరాజు ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.


ఎల్లమాంబేశ్వరి దేవికి పూజలు చేస్తున్న నాయకులు

జియో ట్యాగింగ్ సర్వే వేగవంతం

చాగలమర్రి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో జియో సర్వే ట్యాగింగ్ వేగవంతం చేయాలని ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ తెలిపారు. శుక్రవారం ముత్యాలపాడు సచివాలయాలను తనిఖీ చేశారు. జియో సర్వే పరిశీలించారు. ఇంకా 416 గృహాలు సర్వే చేయాల్సి ఉందని, త్వరగా పూర్తి చేయాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించరాదని, సమయపాలన పాటించాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శులు, ఉద్యోగులు ఉన్నారు.

హైందవ శంఖారావాన్ని విజయవంతం చేయాలి

బేతంచెర్ల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : వచ్చే ఏడాది జనవరి 5న విజయవాడలో నిర్వహించనున్న హైందవ శంఖారావం బహిరంగ సభను విజయవంతం చేయాలని విశ్వహిందూ పరిషత్ నంద్యాల జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రమౌళీశ్వరరెడ్డి కోరారు. శుక్రవారం పట్టణంలోని సౌత్ ఇండియా కంపెనీ ఆవరణంలో హైందవ శంఖారావం కరపత్రాలను విశ్వహిందూ పరిషత్ సభ్యులు విడుదల చేశారు. కార్యక్రమంలో రామ్మూర్తి, నాగమోహన్, మధుమోహన్ రెడ్డి, పోలూరి శ్రీనివాసులు, గూని నాగరాజు, శ్రీనివాసులు, రామ్మోహన్, శ్రీనివాసులు, మురళి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వహిందూ పరిషత్ శోభా యాత్ర

ప్యాపిలి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో శుక్రవారం టీటీడీ, విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో శోభాయాత్ర నిర్వహించారు. స్థానికి ఈశ్వరస్వామి ఆలయం నుంచి యాత్ర సాగింది. ఈ సందర్భంగా విద్యార్థుల వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో టీటీడీ హిందూధర్మ ప్రచార సంఘం నాయకులు వెంకటరెడ్డి, తొగటి సురేష్‌బాబు, దేవీదయాంద సింగ్, కంచిసరేష్, రామాంజినేయులు, లక్ష్మిరంగయ్య పాల్గొన్నారు.


శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు


ట్రాక్టర్‌ను ఢీకొట్టిన లారీ

కొలిమిగుండ్ల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అంకిరెడ్డిపల్లె గ్రామం వద్ద అనంతపూర్-అమరావతి ప్రధాన రహదారిపై శుక్రవారం ఓ లారీ ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో ట్రాక్టర్ ముందు భాగం తీవ్రంగా దెబ్బతినింది. అయితే ట్రాక్టర్ డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి పక్కకు దూకడంతో ప్రాణాలతో బయటపడ్డాడు. ప్రధాన రహదారిలో ఈ ఘటన చోటు చేసుకోవడంతో సుమారు గంట వాహనాలు నిలిచిపోయాయి.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

అందరి సహకారంతో విద్యాభివృద్ధికి కృషి

- చాగలమర్రి ఎంఈవో-2 న్యామతుల్లా



చాగలమర్రి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పదోతరగతి పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణతకు కృషి చేస్తున్నట్లు ఎంఈవో-2 న్యామతుల్లా తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్త విధానాలతో విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఉపాధ్యాయులకు శిక్షణఇచ్చామన్నారు.

ప్రశ్న: వందశాతం ఉత్తీర్ణతకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: ప్రతి రోజు సాయంత్రం అదనంగా ఒక గంట క్లాస్ తీసుకుంటున్నారు. రోజు మోడల్ పేపర్ పరీక్ష పెడుతున్నారు. జనవరి 10 నుంచి మోడల్ పేపర్ల పుస్తకాలతో పరీక్షలు పెడతాం. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి ఉంచాం.

ప్రశ్న: డ్రాపౌట్స్ సంఖ్య ఎలా ఉంది?

జవాబు: ప్రభుత్వ పాఠశాలలో 5276 మంది విద్యార్థులు చదువుతున్నారు. డ్రాపౌట్స్ 134 మందిని గుర్తించాం. వారిలో 103 మందిని చేర్పించాం.

ప్రశ్న: ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా?

జవాబు: యూనిఫామ్స్, బూట్లు, పుస్తకాలు విద్యార్థులందరికీ అందుతున్నాయి. అందని వారిని గుర్తించి అందజేస్తున్నాం.

ప్రశ్న: ఉపాధ్యాయుల కొరత ఉందా?

జవాబు: మండలంలోని పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉన్నది. అయితే సర్దుబాటు ద్వారా ఇబ్బంది లేకుండా చూస్తున్నాం.

ప్రశ్న: మధ్యాహ్న భోజనం పథకం ఎలా ఉంది?

జవాబు: విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నాం. ప్రతి రోజు సిబ్బంది, హెచ్ఎంల పర్యవేక్షణలో తనిఖీలు చేస్తున్నారు. నాణ్యతగల భోజనం ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నాం.

పీఎంఏవైకి దరఖాస్తు చేసుకోండి

డోన్ రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై)కి దరఖాస్తు చేసుకోవాలని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ సొంత స్థలం ఉండి ఇల్లు లేని వారు పీఎంఏవై (అర్బన్) 2.0 కొత్త ఇంటి నిర్మాణానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ పథకం కింద లబ్ధిదారులకు కేంద్ర ప్రభుత్వం రూ.1.50 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ. లక్ష కలిసి మొత్తం రూ.2.50లక్షలు చెల్లిస్తారన్నారు. అలాగే గ్రామీణ పథకం కింద ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు ప్రభుత్వం చెల్లించనుందన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హులైన లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సాయిబాబా ఆలయానికి విరాళం

డోన్ రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని సాయిబాబా ఆలయ నిర్మాణానికి లద్దగిరి సర్పంచ్ హనుమంతు రూ.లక్ష విరాళం అందజేశారు. డోన్ ఎంఎస్ఆర్ కార్యాలయంలో ఏపీ సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డికి విరాళం చెక్కును అందజేశారు. కార్యక్రమంలో సాయిబాబా కమిటీ సభ్యులు సీఎం శ్రీనివాసులు, కుందుకూరు పార్థసారధి, కొండా సురేష్, ఆలా మల్లికార్జున రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పగిలిన పైపులైన్‌కు మరమ్మతులు

డోన్ రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటనాయునిపల్లె గ్రామ సమీపంలో రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద జరుగుతున్న పనుల్లో గ్రామానికి వెళ్లే తాగునీటి పైపులు పగిలిపోయాయి. దాంతో నీటి సరఫరా నిలిచిపోయింది. నీటి సరఫరాకు అంతరాయం కలగకుండా సర్పంచ్ సీలం చంద్రశేఖర్ నాయుడు రైల్వే కాంట్రాక్టు సిబ్బందితో మాట్లాడి కొత్తపైపులైన్లు ఏర్పాటు పనులు యుద్ధప్రాతిపదికగా చేపట్టారు. దాంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

బాధ్యతగా పని చేయాలి

డోన్ రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గ్రామ సచివాలయ సిబ్బంది బాధ్యతగా పని చేయాలని వెంకటనాయునిపల్లె గ్రామ సర్పంచ్ సీలం చంద్రశేఖర్ నాయుడు అన్నారు. శుక్రవారం సచివాలయ ఉద్యోగులతో సమావేశమై మాట్లాడారు. గ్రామ సమస్యలపై సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ పరిష్కరించాలని సూచించారు. సమావేశంలో సచివాలయ ఉద్యోగులు కార్యదర్శి వెంకటరమణ, గ్రామ వీఆర్వో మనోహర్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు సతీష్ పాల్గొన్నారు.

రుద్రవరానికి గోడౌన్ మార్పు

రుద్రవరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : రుద్రవరానికే సివిల్ సప్లై గోడౌన్ మార్చినట్లు పౌర సరఫరాల అధికారులు శుక్రవారం తెలిపారు. గతంలో ఆళ్లగడ్డ మండలం శాంతినగరం గ్రామ సమీపంలో ఉన్న వేర్‌హౌస్‌లో సివిల్ సప్లైగోడౌన్ నిర్వహించారు. తిరిగి రుద్రవరానికి తరలించారు. రుద్రవరం సివిల్ సప్లై గోడౌన్ నుంచి రుద్రవరం, శిరివెళ్ల మండలాలకు నిత్యావసర వస్తువులు సరఫరా అవుతాయని వారు తెలిపారు.

వెదురు సేకరణకు శాంపిల్ ప్లాట్స్ ప్రారంభం

రుద్రవరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రుద్రవరం రేంజ్‌లో వెదురు సేకరణకు శుక్రవారం శాంపిల్ ప్లాట్స్ ప్రారంభించినట్లు ఫారెస్టు అధికారులు తెలిపారు. రుద్రవరం కలప డిపో పరిధిలో చిల్లమానుపెంట, మామిడిమాను చెలిమ, అహోబిళం, గొర్రెగుంత వెదురు కూపులను ఎంపిక చేశారు. వీటిలో డీసీ-3 పరిధిలో వెదురు సేకరణకు ఫారెస్టు అధికారులు శాంపిల్‌ప్లాట్లు వేసినట్లు తెలిపారు.

క్రిష్టిపాడులో సీసీ రోడ్ల పనులు ప్రారంభం

దొర్నిపాడు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని క్రిష్టిపాడు ఎస్సీ కాలనీలో ఉపాధిహామీ పథకం కింద రూ.10 లక్షలతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించినట్లు టీడీపీ నాయకుడు నిమ్మకాయల వెంకట్రామిరెడ్డి శుక్రవారం తెలిపారు. ఎస్సీ కాలనీలో అంతర్గత రోడ్డు సౌకర్యం లేకపోవడంతో కాలనీ వాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. సమస్యను ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించడంతో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజనీర్ ఉజ్మా, టీడీపీ నాయకులు ఉన్నారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు

సంజామల, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడపవద్దని కోవెలకుంట్ల సీఐ హనుమంత నాయక్ వాహన చోదకులను హెచ్చరించారు. శుక్రవారం సాయంత్రం ముదిగేడు క్రాస్ రోడ్డు వద్ద సీఐ, ఆల్వకొండ క్రాస్ రోడ్డులో ఎస్ఐ రమణయ్య వాహనాలు తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా పలు వాహనాలను ఆపి పత్రాలను తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేని వాహనదారులకు అపరాధ రుసుము విధించారు. ప్రధానంగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకుండా ప్రయాణించడం నేరమన్నారు.

బాధితుడికి ఆర్థిక సాయం

ప్యాపిలి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతమ్మతండా చెందిన తావురునాయక్ కిడ్నీ వ్యాధితో కర్నూలులోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. తండాకు చెందిన పలువురు యువకులు సేకరించిన మొత్తాన్ని శుక్రవారం తావురునాయక్‌కు అందజేశారు. కార్యక్రమంలో యువకులు లక్ష్మణ్‌నాయక్, అశోక్‌నాయక్ ఉన్నారు.